





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 270 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 6 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 270 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 6 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## గత సీఎం హెలికాప్టర్ లో వెళుతుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవి

- నిన్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- అనంతవరంలో మొక్కలు నాటిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పర్యావరణ పరిరక్షణ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ




**హైదరాబాద్ పెన్ పవర్:**గత వైసీపీ ప్రభుత్వం చెట్లను నరికివేయడమే పనిగా పెట్టుకుందని, వారికి చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలపై కనీస అవగాహన లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని నరికివేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇవాళ రాజధాని ప్రాంతంలోని అనంతవరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, గత ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవని సెటైర్ వేశారు. కానీ ఇప్పుడు తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తున్నప్పుడు ఒక్క చెట్టు కూడా నరకడం లేదని ప్రజలు గమనించాలని కోరారు.

కొన్ని దేశాల్లో చెట్లను నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారని, చెట్టు నరకాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని చంద్రబాబు గుర్తుచేశారు. చెట్టు నరికితే మనిషిని చంపినంత నేరంగా పరిగణించి చర్యలు తీసుకునే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. "చెట్లు పెంచడం మనందరి బాధ్యత. చెట్లు నరకడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని ఆయన పేర్కొన్నారు. అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా... మరి మొక్కలు నాటే బాధ్యత లేదా?రానున్న నాలుగైదు సంవత్సరాల్లో రాష్ట్రంలో కనీసం 37 శాతం పచ్చదనం ఉండేలా చూడాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం ఉద్యానవన పంటల (హార్టికల్చర్) అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయంలో పవన్ కల్యాణ్ కూడా స్పష్టమైన సూచనలు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం పది మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. "అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా? మరి మొక్కలు నాటే బాధ్యత మనపై లేదా?" అని ప్రజలను ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన రావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో గ్లోబల్ వార్మింగ్ ఒకటని, దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వర్షాలు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో సాగు ప్రమాదంలో పడుతోందని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తి ఫ్లోరైడ్

సమస్యలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు. చిన్నప్పుడు చదువుకున్న కథను గుర్తుచేస్తూ, "ఒక వృద్ధుడు తన తర్వాతి తరాల కోసం చెట్టు నాటినట్లు, మనం కూడా భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటాలి. స్వార్థంతో బతకడం కాదు, విజ్ఞతతో ప్రవర్తించాలి," అని హితవు పలికారు. పద్మశ్రీ వనజీవి రామయ్య వంటి వ్యక్తులు మనకు ఆదర్శమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

## వాళ్లు చిన్న పిల్లకాయలా... మరి నువ్వు కూడా చిన్నపిల్లాడివేనా జగన్ రెడ్డీ?



- జగన్‌పై ఆనం వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం
- గంజాయి, రేప్ కేసుల నిందితులను చిన్నపిల్లలనడంపై మండిపాటు
- చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదన్న ఆనం
- 31 కేసుల్లో వాయిదాలు తీసుకుంటున్నారని జగన్‌పై ఆరోపణ
- లీగల్ ఫీజుల కోసమే రూ.6,904 కోట్లు ఖర్చు చేశారని విమర్శ
- కేసులు తేల్చుకున్నాకే టీడీపీ గురించి మాట్లాడాలని హితవు

**హైదరాబాద్ పెన్ పవర్:**మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ

వివరాలు 2లో..

## సచివాలయంలో సొమ్మసిల్లి పడిపోయిన మంత్రి కొండా సురేఖ



- తెలంగాణ సచివాలయంలో మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత
- ఉదయం నుంచి ఆహారం తీసుకోకపోవడంతో కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి
- వెంటనే ఆహారం అందించడంతో కోలుకున్న కొండా సురేఖ
- మంత్రిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం నాడు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కేబినెట్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమె, సమావేశం ప్రారంభానికి ముందే కళ్లు తిరిగి పడిపోయారు. ఈ ఘటనతో సచివాలయ సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

వివరాల్లోకి వెళితే, మంత్రి కొండా సురేఖ ఉదయం నుంచి ఎలాంటి ఆహారం తీసుకోలేదని తెలిసింది. ఈ కారణంగానే ఆమె అస్వస్థతకు లోనై, సచివాలయంలోని తన ఛాంబర్ వద్దకు వెళుతుండగా సొమ్మసిల్లి పడిపోయినట్లు సమాచారం. మంత్రికి షుగర్ లెవెల్స్ పెరిగాయని తెలిసింది. వెంటనే అప్రమత్తమైన మంత్రి వ్యక్తిగత సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించి, ఆహారం అందజేశారు. కాసేపటికి కొండా సురేఖ తేరుకున్నారు.

ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగాల్సి ఉంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులందరూ సచివాలయానికి చేరుకున్నారు. మంత్రి కొండా సురేఖ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు వెంటనే ఆమె వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్




- బెంగళూరులో ఆర్సీబీ ఐపీఎల్ గెలుపు సంబరాల్లో ఘోర విషాదం
- ఘటనలో 11 మంది మృతి
- మీడియా ముందు కన్నీటి పర్యంతమైన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- దుర్ఘటనపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని విచారణకు ఆదేశం
- డీకే శివకుమార్ నిర్లక్ష్యమే కారణమంటూ ప్రతిపక్షాల విమర్శలు

వివరాలు 2లో..

## ఆసుపత్రిలో చేరిన మాగంటి గోపీనాథ్.. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం!




- బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత, ఆసుపత్రిలో చికిత్స
- గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి హుటాహుటిన తరలింపు
- గుండె సంబంధిత సమస్యగా గుర్తించి చికిత్స అందిస్తున్న వైద్యులు
- ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపిన హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. మాగంటి గోపీనాథ్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం. ఏఐజీ ఆసుపత్రి వైద్యులు ఆయనకు వైద్య

వివరాలు 2లో..

## బహుశా ఆయనకు ఉన్నంత అర్హత నాకు లేదేమో!



- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- అమరావతిలోని అనంతవరంలో కార్యక్రమం
- సీఎం చంద్రబాబుతో పాటు హాజరైన పవన్ కల్యాణ్
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని ఉద్ఘాటన
- వచ్చే ఏడాదిలోగా కోటి మొక్కలు నాటుతానని ప్రతిజ్ఞ

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు అమరావతి ప్రాంతంలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు తన

వివరాలు 2లో..

## ఐరాసలో పాక్‌కు కీలక పదవులు... ఖర్గే సహా కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం



- ఐరాసలో పాక్‌కు ఉగ్రవాద నిరోధక పదవులపై కాంగ్రెస్ ఫైర్
- ఇది దురదృష్టకరం, ఆమోదయోగ్యం కాదన్న ఖర్గే
- పాక్‌ను మళ్లీ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) గ్రే లిస్ట్‌లో చేర్చాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా నిలవండని ప్రపంచానికి పిలుపు

పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని, అలాంటి దేశానికి ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి ఉగ్రవాద నిరోధక కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత పవన్ ఖేడా ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న ఉగ్రవాద పోరాటానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

మల్లికార్జున ఖర్గే గురువారం 'ఎక్స్' వేదికగా ఈ అంశంపై సుదీర్ఘమైన పోస్టు చేశారు. పాకిస్థాన్‌కు ఇటీవల లభించిన ఆర్థిక సహాయ ప్యాకేజీలు, రుణాలను ఆ దేశం తన సైన్యంపైనా, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంపైనా ఖర్చు చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పోషించే పాకిస్థాన్‌ను, ఉగ్రవాద బాధితురాలైన భారత్‌తో పోల్చడం సరికాదని ఖర్గే అన్నారు.

వివరాలు 2లో..

## బెంగళూరు తొక్కిసలాట: కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- ఆర్సీబీ విజయోత్సవాల్లో 11 మంది మృతి, 30 మందికి పైగా గాయాలు
- బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు సుమోటో విచారణ
- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం
- తదుపరి విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా



**హైదరాబాద్ పెన్ పవర్:**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, ప్రభుత్వ తీరుపై ఆరా తీసింది. అడ్వకేట్ జనరల్ సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకున్నామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. "మేము మా అభిప్రాయాలను అడ్వకేట్ జనరల్‌కు తెలియజేశాం. ఆయన దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్‌ను రికార్డులోకి తీసుకున్నాం. ఈ సుమోటో కేసును రిట్ పిటిషన్‌గా నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 10వ తేదీ మంగళవారానికి వాయిదా వేసింది.

చిన్నస్వామి స్టేడియం వద్ద వేలాది మంది అభిమానులు గుమికూడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దురదృష్టకర ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఘటన అనంతరం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచితంగా వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఈ ఘటనపై మేజిస్టీరియల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ ఇమేజ్ పెరిగిందా? తగ్గిందా? తూకం ఎటు వైపు ఉందంటే?

జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు.

**తనకు కేటాయించిన...**

తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.

**మౌనంగా ఉండటం...**

ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు.

**ప్రభుత్వంలో ఉండి...**

నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# వాళ్లు చిన్న పిల్లకాయలా... మరి నువ్వు కూడా చిన్నపిల్లాడివేనా జగన్ రెడ్డీ?

- మొదటి పేజీ తరువాయి

ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంజాయి, పోలీసులపై హత్యాయత్నం, మహిళలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని జగన్ 'చిన్న పిల్లకాయలు'గా అభివర్ణించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "గంజాయి, హత్యాయత్నాలు, రేపులు చేసేవారు చిన్న పిల్లకాయలైతే, మరి నువ్వు కూడా చిన్నపిల్లవాడివేనా జగన్ రెడ్డీ?" అని ఆనం సూటిగా ప్రశ్నించారు.

చంద్రబాబు గురించి మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని హితవు పలికిన ఆనం, "మా అధినేతను నడిరోడ్డుపై కొట్టాలన్న నిన్ను దేనితో కొట్టాలి? 31 కేసులు పెట్టుకుని, విచారణకు హాజరుకాకుండా వాయిదాలతో తప్పించుకు తిరుగుతున్న నిన్ను చెప్పుతో కొట్టాలా?" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. జగన్ ఓటమిపాలై సంవత్సరం గడిచినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని, ఎవరితో ఎవరిని పోల్చాలో కూడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. తన హయాంలోనే కొందరిపై కేసులు నమోదు చేసి, ఇప్పుడు వారిని పరామర్శించడానికి తెనాలి వెళ్లినప్పుడు ప్రజలు "సీఎం సీఎం" అనడానికి బదులు "ఛీఎమ్ ఛీఎమ్" అన్నారని, ఇది జగన్‌కు సిగ్గుచేటని అన్నారు.

వైసీపీ కార్యకర్తలకు జగన్ ఎలాంటి విలువలు నేర్పుతున్నారని ఆనం ప్రశ్నించారు. "రేపులు చేయండి, దొంగతనాలు చేయండి, పోలీసులపై హత్యాయత్నాలు చేయండి, మీరు జైలుకు వెళితే నేను వచ్చి పరామర్శిస్తా అని చెబుతున్నారా?" అని నిలదీశారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతూ పోలీసులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అంబటి రాంబాబు పోలీసులను చూసి పళ్లు కొరకడంపై స్పందిస్తూ, "పళ్లు ఊడగొడతారు జాగ్రత్త" అని హెచ్చరించారు. చంద్రబాబును రోడ్డుపై కొట్టాలన్న వ్యాఖ్యలకు జగన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జగన్‌పై కేసులు నమోదై 5000 రోజులు గడిచిందని, దమ్ముంటే కోర్టుకు వెళ్లి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్న తర్వాతే చంద్రబాబు గురించి మాట్లాడాలని ఆనం సవాల్ విసిరారు. 3,452 సార్లు కోర్టు వాయిదాలు తీసుకోవడం ప్రపంచ రికార్డని, లీగల్ ఫీజుల కోసమే జగన్ రూ.6,904 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. "రోజుకు కోటి 39 లక్షలు ఖర్చుపెట్టి జైలుకు పోకుండా బయట ఉంటున్నావు. నీ కేసులు తేల్చుకునే దమ్ము లేదు కానీ, మా నాయకుల గురించి మాట్లాడతావా?" అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో తన కేసుల విచారణ పూర్తి చేయమని కోర్టును అడిగే ధైర్యం జగన్‌కు ఉందా అని నిలదీశారు.

# ఏపీ పోలీసుల ఏఐ హ్యాకథాన్... డీటెయిల్స్ ఇవిగో!

**గుంటూరులో ఈ నెల 27 నుండి 29 వరకు ఏఐ హ్యాకథాన్**

**27న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**

**ఏఐ హ్యాకథాన్‌లో యువ ఇంజినీర్లకు భాగస్వామ్యం**

**పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలను వివరించిన గుంటూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో కృత్రిమ మేధస్సు సాంకేతికతతో పోలీసింగ్‌లో నాణ్యతను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 27 నుండి 29 వరకు గుంటూరులో ఏఐ హ్యాకథాన్ నిర్వహించనుంది.

ఈ కార్యక్రమాన్ని 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గుంటూరులోని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లడంలో యువతరం తమదైన చొరవ చూపనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహించే ఏఐ హ్యాకథాన్‌లో యువ ఇంజినీర్లకు భాగస్వామ్యం కల్పించారు.

దీంతో యువ ఇంజినీర్లు ఇందుకు సంబంధించి వర్క్‌ను ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణలో వారి పాత్ర, కృత్రిమ మేధ ఉపయోగాలు, పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలపై గుంటూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు వివరించారు.

# చంద్రబాబు బూట్లు తుడుస్తానన్న కొడాలి నాని ఎక్కడ?..

- **గుడివాడ ప్రజలకు కొడాలి వెన్నుపోటు పొడిచారన్న ఎమ్మెల్యే**
- **మంత్రిగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని విమర్శ**
- **ఇంకా నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు**
- **వైసీపీ నేతలు రోడ్లపై డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం**
- **గుడివాడ అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిక**

**హైదరాబాద్ పెన్ పవర్:** గుడివాడలో తాను ఓడి, కుప్పంలో చంద్రబాబు విజయం సాధిస్తే రాజకీయాల నుంచి తప్పుకోవడమే కాకుండా.. చంద్రబాబు బూట్లు శుభ్రం చేస్తానని గతంలో సవాల్ విసిరిన మాజీ మంత్రి కొడాలి నాని ఏడాది కాలంగా ఎక్కడ దాక్కున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రశ్నించారు. నిన్న గుడివాడ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొడాలి నాని గుడివాడ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, దానికి ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రిగా ఉన్న సమయంలో నాని అధికారాన్ని దుర్వినియోగం చేసి అవినీతి ద్వారా భారీగా సొమ్ము కూడబెట్టుకున్నారని ఎమ్మెల్యే రాము ఆరోపించారు. చేసిన తప్పులకు సిగ్గుపడి, పశ్చాత్తాపం చెందాల్సింది పోయి ఇంకా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు సాగించిన అరాచకాలు, దుర్మార్గాలకు గత సంవత్సరం ఇదే రోజున ప్రజలు తమ ఓటు ద్వారా సరైన తీర్పు ఇచ్చారని, దానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి 'వెన్నుపోటు దినం' అంటూ రోడ్ల మీదకు రావడం దారుణమన్నారు.

గడిచిన 20 ఏళ్లుగా గుడివాడ శాసనసభ్యుడిగా కొడాలి నాని అవలంబించిన మోసపూరిత, వెన్నుపోటు రాజకీయాలకు ఆయన జవాబు చెప్పగలరా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇప్పుడు రోడ్డెక్కి నాటకాలు ఆడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గుడివాడ నియోజకవర్గంలో తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కడపలో జరిగిన మహానాడుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి, గుడివాడలో తాను సాధించిన విజయానికి అభినందనలు తెలియజేశారని, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

# ఐరాసలో పాక్‌కు కీలక పదవులు... ఖర్గే సహా కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం

- మొదటి పేజీ తరువాయి

ఐరాస భద్రతా మండలి ఉగ్రవాద నిరోధక కమిటీకి పాకిస్థాన్‌ను వైస్ ఛైర్మన్‌గా నియమించడం, అలాగే 2025 సంవత్సరానికి గాను తాలిబన్ ఆంక్షల కమిటీకి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడాన్ని ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది పూర్తిగా దురదృష్టకరం, అవగాహన రాహిత్యంతో కూడుకున్నది, ఏమాత్రం ఆమోదయోగ్యం కానిది" అని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం అందకుండా నిఘా పెట్టేందుకు పాకిస్థాన్‌ను మళ్లీ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్ట్‌లో చేర్చాలన్న భారత్ డిమాండ్‌లోని సహేతుకతను ప్రపంచ దేశాలు గుర్తించాలని ఖర్గే కోరారు. ఇది కేవలం భారత్ కోసమే కాదని, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాల కోసం కూడా అవసరమని ఆయన స్పష్టం చేశారు. మోస్ట్ వాంటెడ్ ఎ

ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే హతమయ్యాడన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

అంతకుముందు, ఇదే అంశంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా కూడా స్పందించారు. ఉగ్రవాద నిరోధక కమిటీకి పాకిస్థాన్ నాయకత్వం వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. "జూన్ 4వ తేదీన తాలిబన్ ఆంక్షల కమిటీకి పాకిస్థాన్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైంది. ఇది మన విదేశాంగ విధానంలో ఒక విషాదగాథ. అసలు ప్రపంచ దేశాలు దీనికి ఎలా అనుమతించాయి?" అని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.

# బహుశా ఆయనకు ఉన్నంత అర్హత నాకు లేదేమో!

- మొదటి పేజీ తరువాయి

వంతు కృషిగా వచ్చే ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్రంలో కనీసం కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన ప్రకటించారు. అడవుల్లో కార్చిచ్చులను నివారించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

ఈ సందర్భంగా పర్యావరణవేత్త కుమెర అంకారావు సేవలను పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "14 ఏళ్ల వయసులో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఒక పక్షి చనిపోవడం చూసి చలించిపోయి, మూడు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణకు అంకితమైన కుమెర అంకారావు గారి నిబద్ధత ప్రశంసనీయం. ఆయనకున్నంత అర్హత బహుశా నాకు లేదేమో అనిపిస్తుంది" అంటూ పవన్ వినమ్రంగా వ్యాఖ్యానించారు. నల్లమల అడవుల పరిరక్షణ కోసం అంకారావు చేస్తున్న కృషి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అటువంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, అధికారులకు పవన్ ధన్యవాదాలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు స్ఫూర్తి అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. "చెట్టు-నీరు" వంటి కార్యక్రమాల ద్వారా చంద్రబాబు పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని, ఆయన మార్గదర్శకత్వంలో పర్యావరణ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. "ప్రస్తుతం అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు నా వద్ద ఉన్నాయి. వచ్చే ఏడాది ఇదే సమయానికి కోటి మొక్కలు నాటడమే కాకుండా, అడవుల్లో కార్చిచ్చులను అరికట్టి, గొర్రెలు, మేకల కాపరులకు అవగాహన కల్పించి, అడవుల నరికివేతను తగ్గించి, అప్పుడు మరింత అనుభవంతో మీ ముందుకొచ్చి మాట్లాడతాను" అని పవన్ కళ్యాణ్ అన్నారు.

చెట్లు మన జీవితంలో ఎంత కీలకమో వివరిస్తూ, "ఒకప్పుడు ఇళ్లకు దారి చెప్పాలంటే మర్రిచెట్టునో, గోరింటాకు చెట్టునో ఆనవాలుగా చెప్పేవాళ్ళం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెట్లు లేని జీవితాన్ని ఊహించుకోలేం. అవి కేవలం పక్షులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఆధారం" అని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం పచ్చదనం సాధించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి గారు మా అందరికీ రాష్ట్రంలో 33 శాతం కాకుండా, 50 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని లక్ష్యం నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను పర్యావరణ పరిరక్షణలో, అటవీ సంరక్షణలో, నగర వనాల్లో తలమానికంగా నిలపడానికి మనమందరం కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చే సూచనలు, సలహాలు స్వీకరించి, వచ్చే ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుని ఆయన మెప్పు పొందేలా పనిచేస్తామని పవన్ కళ్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:**బెంగళూరు నిన్న జరిగిన ఘోర దుర్ఘటన పెను విషాదాన్ని మిగిల్చింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాల్లో తీవ్ర తొక్కిసలాట జరిగింది. ఈ దురదృష్టకర ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 47 మంది వరకు గాయపడ్డారు. ఈ సంఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

"ఆ చిన్నారుల గురించి నాకు చాలా ఆందోళనగా ఉంది. వాళ్లు 15 ఏళ్ల వయసు వాళ్లు. కనీసం 10 మంది చనిపోవడం నా కళ్లారా చూశాను. ఈ నష్టాన్ని ఏ కుటుంబం తట్టుకోలేదు" అంటూ డీకే శివకుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వారిని చూసి తాను చలించిపోయానని ఆయన తెలిపారు.

పరిస్థితి ఎంత వేగంగా చేయిదాటిపోయిందో వివరిస్తూ, "కార్యక్రమాన్ని పది నిమిషాల్లో ముగించేయాలని పోలీస్ కమిషనర్ నాకు చెప్పారు. అందుకే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేశాను. అప్పటికే ఒకరిద్దరు చనిపోయారని, వెంటనే ముగించమని ఆయన నాతో అన్నారు" అని శివకుమార్ వెల్లడించారు.

ప్రభుత్వం నుంచి సహాయం.. విచారణకు ఆదేశం

ఈ దుర్ఘటనపై కర్ణాటక ప్రభుత్వం తక్షణమే స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించింది. గాయపడిన వారికి ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. సీఎం సిద్ధరామయ్య ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

"ఇలాంటి విషాదం జరిగి ఉండాల్సింది కాదు. ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది" అని ఆయన అన్నారు. స్టేడియం సామర్థ్యం కేవలం 35వేలు కాగా, సంబరాల కోసం సుమారు 2 నుంచి 3 లక్షల మంది ప్రజలు గుమిగూడారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు.

రాజకీయ దుమారం.. న్యాయపరమైన చర్యలు

ఈ దుర్ఘటన రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ... డీకే శివకుమార్ అపరిపక్వత, బాధ్యతారాహిత్య ప్రవర్తన వల్లే ఈ విషాదం జరిగిందని ఆరోపించారు. ఆయన తక్షణమే డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరియు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, వారిపై ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 106 కింద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్టేడియంలోని గేట్ నెం.7 వద్ద ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ విజయాన్ని పురస్కరించుకుని నగరం మొత్తం జరుపుకోవాల్సిన వేడుక కాస్తా, సరైన ప్రణాళిక లేకపోవడం, అస్పష్టమైన సమాచారం, నియంత్రణ చర్యలు విఫలం కావడం వల్ల విషాదంగా మారిందని తెలుస్తోంది. ఈ ఘటనను కర్ణాటక హైకోర్టు సుమోటోగా స్వీకరించి, విచారణకు తేదీని ఖరారు చేసింది. ఈ దుర్ఘటనకు గల పూర్తి కారణాలు విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఆసుపత్రిలో చేరిన మాగంటి గోపీనాథ్.. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం!

- మొదటి పేజీ తరువాయి

సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వార్తలు వస్తున్నాయి. వైద్య బృందం ఆయన ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్నారు. వారు గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ, మాగంటి గోపీనాథ్‌కు ప్రస్తుతం ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు.

# బెంగళూరు తొక్కిసలాట: కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

విచారణకు కూడా ఆదేశించారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజలు వస్తారని ప్రభుత్వం ఊహించలేకపోయిందని ఆయన అన్నారు.

ఈ విషాద ఘటనపై రాజకీయంగా తీవ్ర దుమారం రేగింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటన "హృదయ విదారకం" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మరోవైపు, జేడీ(ఎస్), బీజేపీ నేతలు మాత్రం ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపిస్తూ, బాధ్యుల రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# కొనకనమిట్లలో వనం - మనం కార్యక్రమం రద్దు

## వనం మనం కార్యక్రమానికి డుమ్మా కొట్టిన అటవీశాఖ అధికారులు

**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 5**

కొనకనమిట్ల మండలంలో గురువారం జరగవలసిన వనం మనం కార్యక్రమం రద్దు అయ్యింది.మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వనం మనం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అటవీశాఖ అధికారులు వచ్చారా లేదా అని ఎమ్మెల్యే ఆరా తీసి..రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రపంచమంతా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవం కార్యక్రమానికి అటవీశాఖ అధికారులు రాకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.అటవీశాఖ అధికారులు వనం -మనం కార్యక్రమానికి డుమ్మా కొట్టడంతో ఎమ్మెల్యే మొక్క నాటకుండా కార్యక్రమానికి బాయ్ కాట్ చేసి వెనుదిరిగి వెళ్ళిపోయారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,ఉపాధి హామీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

పెన్ పవర్ ప్రకాశం

# హరిత కందుకూరుకు కృషి చేద్దాం

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు









**కందుకూరు పెన్ పవర్, జూన్ 5**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరిత కందుకూరు లో భాగస్వామ్యం కావాలని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు పట్టణం పామూరు రోడ్డు కూడలిలో కందుకూరు పురపాల సంఘం ఆధ్వర్యంలో మొక్కల నాటింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి, దానిని పెంచితేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలుగుతామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపివేయాలని, వాడిన ప్లాస్టిక్ ను ఎక్కడ పడితే అక్కడ పారేయడం వల్ల భూమికి హానికరం, మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారుతుందని తెలియజేశారు. అలాగే, పర్యావరణానికి విఘాతం కలిగించే చర్యల వలన చిన్న పిల్లలకి క్యాన్సర్ వంటి మహమ్మారులు సోకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను విచక్షణారహితంగా నరికి వేయడం, డ్రైనేజీల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ పదార్థాల వేగవంతమైన వ్యాప్తి ఇవన్నీ అనారోగ్యానికి మూలకారణమని అన్నారు. హరిత కందుకూరు లక్ష్యంగా అందరం ముందుకెళ్లాలి అని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కల నాటింపు కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. సబ్ కలెక్టర్ టి. శ్రీ పూజ మాట్లాడుతూ పిల్లల్లో చిన్ననాటి నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించాలి. మొక్కల పెంపకం ఒక నిత్యజీవితపు భాగంగా మారాలి అని సూచించారు.మొక్కల నాటిన అనంతరం విద్యార్థులు, అధికారులు కలిసి పర్యావరణం పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, అటవీ శాఖ అధికారులు కిషోర్, మెప్మా సిబ్బంది, తెదేపా పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షులు గుర్రం మాల్యాద్రి, వడ్లమూడి సురేష్, యడ్లపల్లి సుబ్బారావు, రఫీ, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, గొంది నరసింగరావు, ఉన్నం వీరాస్వామి, అత్తోట మధుబాబు, పెంట్రాల సుబ్బారావు, గుర్రం మల్లికార్జున, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పచ్చదనం, పరిశుభ్రత దోహదం

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అధికారులు





**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పరిశుభ్రత ఎంతో అవసరమని కొమరోలు డిప్యూటీ ఎంపీడీవో డి బ్రహ్మయ్య తెలిపారు .ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాటిచెర్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే. ఆనందరావు, అల్లినగరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం ,ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవో డి బ్రహ్మయ్య ,ఏపీవో మహాలక్ష్మి దేవి తదితర అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఆ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చెట్లు ఎంతో దోహదపడతాయని అన్నారు. అందువల్ల ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్ళ ముందు, ఖాళీ స్థలాలలో, వీధులలో, బస్టాండు, రచ్చబండ, విద్యాసంస్థలు ,,ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పెంచాలని కోరారు. విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు మొక్కలను దత్తతగా తీసుకొని పెంచాలని కోరారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు మాట్లాడుతూ అడవులను పరిరక్షించడం వలన సకాలంలో వర్షాలు కురవటమే కాకుండా మానవాళికి అడవులు ఎంతగానో ఉపయోగపడగలవని తెలిపారు. అల్లినగరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, అడవులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నచిన్న స్వార్థ ప్రయోజనాలకు అడవుల్లోని చెట్ల నరకటం మంచి సాంప్రదాయం కాదని, చెట్లను మనము కాపాడగలిగితే అవి మనకు ఎంతో మేలు చేసి జీవన ప్రమాణాలు పెంచేందుకు దోహదపడగలవని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో బస్ క్యాంప్ సిబ్బంది, అల్లినగరం బీటు స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, బేస్తవారిపేట రేంజి అటవీ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# స్వచ్ఛ హరితాంధ్ర కోసం అడుగేద్దాం

**ప్లాస్టిక్ పెనుభూతాన్ని తరిమేద్దాం.. ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం.**

**చెట్లు మానవ మనుగడకు మేలు -విచక్షణారహితంగా చెట్లను నరక రాదు**

**ఇంటికో చెట్టు నాటి సంరక్షించాలి -మొక్కలు నాటి దత్తత తీసుకొని పెంచాలి**

**గిద్దలూరులో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి**





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన “వన మహోత్సవం” కార్యక్రమాన్ని గురువారం గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు.. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదనీ, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని అన్నారు. అడవులను కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యం అన్నారు. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నేడు ఒక్కరోజు మొక్కలు నాటే కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంచి పరిసరాలు ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుందని, అందుకే స్వచ్ఛ భారత్ లో భాగంగా మనం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టామని అన్నారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షణ భాధ్యత తీసుకోవాలని కోరారు. పాఠశాలలో నాటిన మొక్కలను పిల్లలకు దత్తత ఇచ్చి మొక్కలను పెంచే విదంగా చర్యలు చేపట్టాలని సూచించారు. చెట్లతోనే మానవవ మనుగడ యని,పేర్కొన్నారు. అడవులను కొందరు విచక్షణ రహితంగా నరుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాల్సిన భాధ్యత తీసుకోవాలిగాని , వాటిని నరకటమ్ మానాలన్నారు. చెత్తను ఇంధనంగా మారుస్తూ ప్రకృతిని కాపాడుతున్నామని, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ పొల్యూషన్ నిర్మూలన అంశాన్ని థీమ్ గా తీసుకున్నామని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా పనిచేద్దామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకుందాం అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అటవీ శాఖ డి.ఎఫ్.ఓ నిషా కుమారి, కమిషనర్ శ్రీనివాసులు, గిద్దలూరు జడ్పిటిసి సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి, మార్తాల సుబ్బారెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటడం కాదు వాటిని కాపాడాలి!!

## పర్యావరణ పరక్షణకు ప్లాస్టిక్ వస్తువులు , ప్లాస్టిక్ సంచుల వినియోగం పూర్తిగా మానేయ్యాలి !!

## ప్లాస్టిక్ కవర్లలో వ్యర్థ ఆహారపదార్ధాలను బయట వేయటం వలన పశువులు తినటం తో మరణిస్తున్నాయి

### అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి.కె. భరత్ చంద్ర

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం గిద్దలూరు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో కోర్టుల ప్రాంగణం లో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి.కె. భరత్ చంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలోని జనాభా ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య పర్యావరణ సమతుల్యత అని, పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటడమే కాక వాటిని శ్రద్ధగా పరిరక్షించాలని , వాతావరణ ఉష్ణోగ్రతలు ఎక్కువైపోతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువులను కాని, కవర్లను కాని వినియోగించడం పూర్తిగా మానుకోవాలన్నారు .వ్యర్థ ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ కవర్లను తిన్న జంతువులు అవి అరగక చనిపోతున్నాయని, ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థములను నిలువచేసి తినటం వలన మనుషులు భయంకరమైన క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వస్తువులను ,కవర్ల వాడకం మానివేసి రక్షణ పొందాలన్నారు. ఎక్కువగా మొక్కలు నాటి ఎక్కువ ఆక్సిజన్ ను అందించడం ద్వారా భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణమును అందించవలసిన బాధ్యత



మనఅందరిపై ఉందన్నారు. నీటి వ్యర్థాన్ని అరికట్టాలని హితవు పలికారు .పర్యావరణ పరిరక్షణకు పచ్చని మొక్కలు మానవ మనుగడకు ఎంతో ఎంతో మేలు చేస్తాయని, సరైన వర్షాలు పడతాయని తెలియజేశారు. ఈసందర్భంగా కోర్ట్ ప్రాంగణం ఆయన పండ్ల మొక్కలు నాటారు.ఈ



కార్యక్రమములో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి .ఎన్. శేషశయనా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు. ప్రకాష్, సీనియర్ న్యాయవాదులు యస్.వి. భాస్కరరావు, కె.హిమశేఖర్ రెడ్డి ,ఏ. తిరుమల ప్రసాద్ ,యు .మల్లికార్జున రావు, చల్లగాలి పోలయ్య, కటారు పోలయ్య, డి సిద్దయ్య, జూనియర్ న్యాయవాదులు జె.రంగమోహన్, వి .బాలకృష్ణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. అరుణకుమారి ,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధ న రావు ,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలిలో వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పొదిలిలో జరిగిన ఒక వివాహ వేడుకల్లో దర్శి శాసనసభ్యులు, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు పట్టణంలోని మంజునాథ కళ్యాణమండపం లో గురువారం నాడు జరిగిన బాదం వెంకటేశ్వర రెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### మండల తహసిల్దార్ కృష్ణారెడ్డి స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి చెప్పారు గురువారం నాడు వన మహోత్సవం సందర్భంగా ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాలుష్య వాతావరణం నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ షేక్ సాజిదా, వి ఆర్ ఓ ల సంఘం నాయకులు కిలారి సుబ్బారావు, మండల సర్వేయర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

# శక్తి సదన్‌లో ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి సూచన మేరకు ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి చే నిర్వహింబడుతున్న శక్తి సద న్ లో పర్యావరణాన్ని కాపాడతామని ప్రమాణం చేసి ప్రాంగణం బయట మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తామని, ప్రతి నీటిని వృధా చేయకుండా ఆదా చేస్తామని చెట్లు నాటి పెంచుతామని పర్యావరణాన్ని కాపాడతామని ఈ సందర్భంగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, కోశాధికారి బీరం అరుణ లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి వారి నైతిక బాధ్యత అని పర్యావరణాన్ని పరిక్షించుకోలేకపోతే సమాజం మనుగడే లేదని అందరూ దీన్ని బాధ్యతగా చేపట్టాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలోహోమ్ కమిటీ మెంబర్ మరియు ఎక్స్ ఎంపీపీ చిరు తోటి నరసమ్మ, హోమ్ సిబ్బంది చల్ల కనకదుర్గ, ఒంటేరు మదన్, గుంటుపల్లి శ్రీదేవి, పి.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నోకష్టాలు అనుభవించాం

### అందుకే తెలుగుదేశం పార్టీలో చేరుతున్నాం

### ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

### ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన 50 బీసీ కుటుంబాలు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్5**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో కొమరోలు మండలం, పుల్లారెడ్డిపల్లె పంచాయతీ, గౌహరపల్లె గ్రామానికి చెందిన 50 బీసీ కుటుంబాలు గురువారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికీ ఎమ్మెల్యే అశోక్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతీ ఒక్కరికి సంక్షేమం అందుతుందని, గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని, గత వైసీపీ పాలనలో అరాచక పాలన తప్ప అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ కనిపించలేదన్నారు. ప్రజాపాలన సాగించే కూటమి ప్రభుత్వం వెంటే తామంతా ఉంటామని, గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికీ, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన బొమ్మిని పెద్ద నాగయ్య, మారే వీరాంజనేయులు, జంగాల చిన్న రామయ్య, దాసరి బాలాజీ, జంగాల లక్ష్మయ్య, జంగాల పెద రామయ్య, కొండు గారి శ్రీనివాసులు, మారే పెద్ద తిరుపతయ్య, జంగాల రామ నాయుడు, నాగ శేఖర్, వెంకటనారాయణ, రామానాయుడు ,నాగార్జున, సిసింద్ర, బ్రహ్మానాయుడు, రాజేష్, బోడిగా ఓబులపతి, గంజికుంట్ల రవి, మరియు మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, పాలుగుళ్ల శివారెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి రామకృష్ణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దప్పిలి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

### రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ గీత



**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మాజీ సర్పంచ్, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యురాలు, స్థానిక ప్రముఖ మహిళా డాక్టర్ స్వర్ణ గీత అన్నారు గురువారం నాడు వన మహోత్సవం సందర్భంగా పొదిలి పట్టణ శివారులోని చంద్రన్న కాలనీ లో ఆమె మొక్కలు నాటారు ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటడం అత్యంత ముఖ్యమన్నారు తద్వారా భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణన్ని అందించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతి రావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా, మాజీ సర్పంచ్ కాటూరి వెంకటనారాయణ ప్రతాప్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు ముల్లా కుద్దూస్, తెలుగుదేశం నాయకులు వీరిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరునాళ్లకు మజ్జిగ వితరణ కార్యక్రమం అభినందనీయం

### మజ్జిగ పంపిణీ కార్యక్రమమును ప్రారంభించిన కదిరి, ఆమంచి

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

చంద్రశేఖరపురం పట్టణంలోని వి ఆర్ నగర్ నందు వెలసిన రాచూరి పెద్దమ్మ తల్లి తిరుణాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాపు నాయుడుల ఆధ్వర్యంలో నిర్వహించుచున్న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగుతున్న సందర్భముగా మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్, రవి ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంను కాపు నాయకులు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరుడు కదిరి ప్రకాశరావు, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా కాపు నాయకులు గూడంశెట్టి రవికుమార్, మారుల రవి కుమార్ లు వేసవి కాలంలో మజ్జిగ అందించి ఉచిత మజ్జిగ ద్వారా ప్రజల దాహర్తిని తీర్చడం ఎంతో మంచి పుణ్యకార్యమని అన్నారు ఎద్దుల బండలాగుడు పోటీలు చూడుటకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్న సందర్భంలో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడం వేడి గాలులు ఎక్కువగా



ఉన్నందువల్ల వడదెబ్బకు గురికాకుండా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పంపిణీ చేసిన రవి కుమార్, మారెళ్ళ రవికుమార్ ను అభినందించారు ఈ కార్యక్రమంలో బొబ్బూరి రమేష్, తోట అశోక్, ఆకుపాటి వెంకటేష్, మజ్జిగ దాత మారెళ్ళ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో వివాహ వేడుకల్లో పాల్గొన్న అన్నా రాంబాబు





**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పొదిలిలో గురువారం నాడు జరిగిన ఒక వివాహ వేడుకల్లో మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త అన్నా రాంబాబు పాల్గొన్నారు మంజునాథ కళ్యాణ మండపం లో బాదం వెంకటేశ్వర రెడ్డి తనయుడు వెంకట మంజునాథరెడ్డి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న అన్నా రాంబాబు వధూవరులను ఆశీర్వదించారు అదేవిధంగా మరో మాజీ శాసనసభ్యులు, వైకాపా నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత, స్వర్ణ వెంకటేశ్వర్లు దంపతులు కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చైర్మన్ బొప్పరాజు



**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్య ల్ని ప్రభుత్వం వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు గురువారం నాడు తన వ్యక్తిగత పనులపై మార్కాపురం వెళు తూ , మార్గమధ్యంలో ని పొదిలిలో కొద్దిసేపు ఆగారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు అందుతున్నాయి అన్నారు అందుకు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని త్వరతగతి నా పరిష్కరిం చి, న్యాయం చేయాలని ఆయన కోరారు ఆయన వెంట జిల్లా ఏపీ ఆర్ ఎస్ ఏ నాయకులు ఏవి రవిశంకర్, జిల్లా వీఆర్వోల సంఘం నాయకులు కిలారి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# క్విజ్ కాలేజీ లో అమ్మ పేరుతో ఒక మొక్క

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 05**

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి గురువారం మొక్కలు నాటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒంగోలులోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చెన్నకేశవ నగర్ నుంచి బీజేపీ కార్యకర్తలు, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీ సీ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. విరాట్ నగర్, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డి పాలెం, క్విస్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సూర్య కళ్యాణ్ చక్రవర్తి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని అన్నారు. దాని ద్వారా గ్లోబల్ వార్మింగ్ తగ్గి సకాలం లో ఋతుపవనాలు వచ్చి సకల జీవరాశి సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. హరిత ఆంధ్ర ప్రదేశ్ వికసిత్ భారత్ నిర్మాణాన్ని సాధించడంలో భాగంగా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో పాల్గొని కాలుష్య వ్యర్థాలను, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ, నీరు, విద్యుత్తు వంటి వనరులని దుర్వినియోగం చెయ్యకుండా ప్రతి ఒక్కరు కాపాడాలని అన్నారు. క్విస్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీ సీ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు అంత తమ ఇళ్ళలో కూడా మొక్కలు నాటాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్, కార్పొరేటర్ మోహన్, బిజెపి నాయకులు, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సీ సీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

# రాపర్లలో మొక్కలు నాటిన దేశం నేతలు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నాగులుప్పలపాడు మండలం రాపర్ల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఎన్.జి.పాడు మండలం తెదేపా అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రవి, టిఎ సురేష్, హౌసింగ్ వర్కర్స్ ఇన్స్పెక్టర్ లింగాల లాజరు, టిడిపి మండల కోశాధికారి మెట్టు సుబ్బయ్య నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు గంగి రమణారెడ్డి, ఉప సర్పంచ్ పూల కొండయ్య,మండే బాబురావు, కోటు రాఘవరెడ్డి, మండే రమేష్ , ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, శెట్టి వీరాంజనేయులు, గన్నవరపు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# రాచురి పెద్దమ్మ తల్లి సన్నిధిలో బోయళ్ళ నారాయణరెడ్డి





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

చంద్రశేఖరపురం పట్టణంలోని వి ఆర్ నగర్ నందు వెలసిన శ్రీ రాచూరి పెద్దమ్మ తల్లి తిరుణాల మహోత్సవ సందర్భంగా మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ళ నారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో వరికూటి నాగరాజు, రేనాటి వెంకటేశ్వర్లు, రవి, గుంజే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి

**బిజెపి నాయకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి**





**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత, భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం నాడు పొదిలి పట్టణ శివారులోని గోశాలలో బిజెపి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు అందువల్ల కాలుష్య వాతావరణాన్ని నివారించవచ్చని, అలాగే భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చు అన్నారు మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం అందరూ ఒక అలవాటుగా చేసుకోవాలని విజయలక్ష్మి సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, బిజెపి నాయకులు సూరెడ్డి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ రఫీ, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## -ఏపీఓ దయాసాగర్





**వలేటివారిపాలెం పెన్ పవర్ జూన్ 5**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఏపీఓ దయాసాగర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పోకూరు గ్రామంలో తేదేపా పార్టీ నాయకులు నవులూరి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో సచివాలయ ప్రాంగణం లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలోని జనాభా ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య పర్యావరణ సమతుల్యత అని, పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటడమే కాక వాటిని శ్రద్ధగా పరిరక్షించాలని అన్నారు. వాతావరణ ఉష్ణోగ్రతలు ఎక్కువైపోతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువులను కాని, కవర్లను కాని వినియోగించడం పూర్తిగా మానుకోవాలన్నారు .ఎక్కువగా మొక్కలు నాటి ఎక్కువ ఆక్సిజన్ ను అందించడం ద్వారా భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణమును అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీటి వ్యర్థాన్ని అరికట్టాలని హితవు పలికారు .పర్యావరణ పరిరక్షణకు పచ్చని మొక్కలు మానవ మనుగడకు ఎంతో ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

గిద్దలూరు పట్టణంలో రైల్వే శాఖ ఆదేశాల మేరకు రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రంగస్వామి , రైల్వే రక్షక దళం సబ్ ఇన్స్పెక్టర్ కే పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలోని పాముల పల్లె గేట్ , రాచర్ల గేట్ చుట్టుపక్కల ప్రజలకు, పశువుల కాపరులకు, రైతులకు రైల్వే శాఖ అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ ఆధ్వర్యంలో మే 28వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలియజేశారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్లు దాటేటప్పుడు తగు భద్రత నియమాలను పాటించాలని, కాలం విలువైనది అని, ప్రాణం అంతకంటే విలువైనదని, తిరిగి తీసుకుని రాలేనిదని అన్నారు. మీ భద్రత - మా ధ్యేయం అని తెలియజేశారు. రైలు పట్టాల వెంబడి పశువులను మేతకు ఎవ్వరూ తోలుకొని వెళ్లవద్దని, మీరు పశువులను రైలు పట్టాల వెంబడి మేతకు తీసుకెళ్లినప్పుడు నోరులేని మూగ జీవాలు ప్రమాదానికి గురై చనిపోతుంటాయని దీనివల్ల మీకు నష్టం జరుగుతుంది కాకుండా రైలు కానీ గూడ్స్ కానీ వెళ్లేటప్పుడు రైలు పట్టాలను, గేట్ క్రింద నుండి వాహనాలను తీసుకొని వెళ్లరాదని అలాగే మూగజీవాలు కూడా వాటి కిందపడి రైలుకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని దీనివల్ల భారీగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంటుందని ఎవ్వరూ పశువులను మేతకు రైలు పట్టాల వెంబడి కానీ రైలు వెళ్ళు ప్రాంతానికి దగ్గరగా గాని తీసుకొని వెళ్లకుండా దూరంగా పశువులను మేతకు తీసుకొని వెళ్లాలని కోరారు. ఒకవేళ ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే వారిపైన చట్టపరమైన చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎస్. శేషయ్య, ఇంజనీరింగ్ స్టాప్ వెంకటేశ్వర్లు, భాస్కర్, పాయింట్స్ మెన్ ఎలీషా, సిద్దయ్య, రైల్వే సిబ్బంది, పశువుల కాపరులు, రైతులు, పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇరువురి జరిమానా

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో ఐదుగురిని గురువారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా గిద్దలూరు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె. భరత్ చంద్ర డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికీ 10,000 రూపాయలు జరిమానా, ఇద్దరికీ మూడు రోజులు మరియు ఐదు రోజులు జైలు శిక్ష ,ఒకరికి 10000 రూపాయలు జరిమానా తో పాటు ఆరు నెలల వరకు ఎలాంటి వాహనాలు నడప కుండా లైసెన్స్ ను డిస్ క్వాలిఫై చేస్తూ చేస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని గిద్దలూరు అర్బన్ సీఐ కె . సురేష తెలిపారు.



# మన్నేపల్లి చిన్ని భౌతిక దేహాన్ని సందర్శించి నివాళు లర్పించిన ఎమ్మెల్యే ఉగ్ర



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

చంద్రశేఖరపురం పట్టణమునకు చెందిన మన్నేపల్లి చిన్ని హైదరాబాదులో ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు చిన్ని భౌతిక దేహాన్ని సొంత గ్రామమైన సిఎస్పురంనకు తీసుకొని వచ్చారు మృతి వార్త తెలుసుకున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం ఉదయం మన్నేపల్లి చిన్ని నివాస గృహమునకు చేరుకొని మన్నేపల్లి చిన్ని భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు, మన్నేపల్లి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, సంగిశెట్టి పేరయ్య, చెరుకుపల్లి వెంకటరెడ్డి, మన్నేపల్లి రవి తదితరులు ఉన్నారు.

# ఆనారోగ్యంతో బాధపడే వారికీ, ఆపన్న హస్తం.. ముఖ్యమంత్రి సహాయనిధి

### గిద్దలూరు నియోజకవర్గంలోని 55 మందికి రూ. 56,78,882 -00లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల.




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 55 మందికీ 5 విడతగా మంజూరు అయిన, రూ, 56,78,882-00 ల ముఖ్యమంత్రి సహాయ నిధి, చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనారోగ్యంతో బాధపడే వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చునన్నారు.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2,54,046,48 -00 లు అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు..

**ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ది పొందిన వారి వివరాలు..**

**అర్ధవీడు మండలం:** కత్తి కామేశ్వరి, కందుకూరు, రూ.25,000/- రవ్వ భాగ్య లక్ష్మి, యాచవరం, రూ.30,786/-

గువ్వల వెంకట రమేష్, బొల్లుపల్లి, రూ.1,57,200/-షేక్ పెద్ద మస్తాన్, గన్నేపల్లి, రూ.17,114/-

షేక్ రసూల్, మగుటూరు, రూ.33,678/-దుమవాత్ హనిమే నాయక్, మగుటూరు, రూ.40,000/-

**బెస్తవారిపేట మండలం..:** షేక్ చిన్న ఖాసిం పీర, బెస్తవారిపేట, రూ.1,05,650/-

ఒబిలబోయిన చిన్న రాజయ్య, పిట్టికాయగుళ్ళ, రూ.2,07,029/- దేగుపాటి కాశయ్య, శిగారపల్లి, రూ.48,795/-

కోడె నాగమణి, బెస్తవారిపేట, రూ.27,734/- కామిరెడ్డి రాజకుమార్ రెడ్డి, వంగపాడు, రూ.1,36,204/- బైనగారి శ్రీనివాసులు, బెస్తవారిపేట, రూ.89,684/-నాగిరెడ్డి శివ రెడ్డి, పందిళ్లపల్లి, రూ.2,84,518/- లాకా బాల కొండయ్య, వంగపాడు, రూ.60,000/-కంచర్ల శంకర్ రావు, బెస్తవారిపేట, రూ.3,48,800/-కొళ శ్రీనివాసులు, కోత్తపేట, రూ.57,500/-

**కంభం మండలం..:** నుసుల్లపల్లి ఈశ్వర్, లింగోజిపల్లి, రూ.20,000/-

నల్లం చంద్రమౌళి, రావిపాడు, రూ.54,799/-

సైరెడ్డి బాల సుబ్బారెడ్డి, కందులపురం, రూ.98,693/-

షేక్ ఖాసిం పీర, కంభం, రూ.1,86,644/-షేక్ అస్మా, హజారత్ గూడెం, రూ.20,000/-

షేక్ అబ్దుల్ రసూల్, కందులపురం, రూ.81,799/-గుర్రం సాయి సుమ, హజారత్ గూడెం, రూ.23,063/-

షేక్ నాయబ్ రసూల్, తురిమేళ్ళ, రూ.99,920/-

**గిద్దలూరు మండలం - టౌన్**

సలీంద్ర నారాయణ, గిద్దలూరు టౌన్, రూ.20,524/- బలుస వెంకట నారాయణ, గిద్దలూరు టౌన్, రూ.70,000/-బరెడ్డి రమణ రెడ్డి, గిద్దలూరు టౌన్, రూ,73,300/-

డి జనార్ధన్ రావు, గిద్దలూరు టౌన్, రూ.1,00,457/-నాదెళ్ళ వెంకట రమణ, గిద్దలూరు టౌన్, రూ.60,105/-షేక్ హసీనా, గిద్దలూరు టౌన్, రూ. 1,15,745/-పిక్కిలి ఓబులమ్మ, గిద్దలూరు టౌన్, రూ.1,12,000/-

కామసాని రామక్రిష్ణ రెడ్డి, గిద్దలూరు టౌన్, రూ.1,95,999/- పందిళ్లపల్లి శివ పార్వతి, గిద్దలూరు టౌన్, రూ.30,786/-సోమిరెడి పోలి రెడ్డి, క్రిష్ణంశెట్టిపల్లి, రూ.1,45,329/- తంబుర నాగేంద్ర చారి, ముండ్లపాడు, రూ.25,263/-

కంచంరెడ్డి లక్ష్మిరెడ్డి, నరవ, రూ.76,961/-

భుపాని భూపాల్, క్రిష్ణంశెట్టిపల్లి, రూ.84,229/-

పసుపుల మూడవ ఓబయ్య, తిమ్మాపురం, రూ.2,12,139/-

పాలకొలను భూపాల్ రెడ్డి, నరవ, రూ.18,000/-

బుడత మధుసూధన్ రావు, సజీవరావుపేట, రూ.4,69,165/-

పాలకొలను వెంకట రెడ్డి, నరవ, రూ.38,280/-

కురుకుండు శశాంక్, ముండ్లపాడు, రూ.94,370/-పెండుకురి ఆది లక్ష్మి, బురుజుపల్లి, రూ.25,524/-

భునేబోయిన లక్ష్మి దేవి, నరవ బయనపల్లి, రూ.19,119/- పెట్లవాత్ కౌసల్య బాయి, దిగువమెట్ట తాండ, రూ.37,000/-

**రాచర్ల మండలం**

గొంటు అభిరామ్ రెడ్డి, సత్యవోలు, రూ.85,695/- మిట్టటి బాల కోటారెడ్డి, ఒద్దులవాగుపల్లి, రూ.1,39,581/- మొత్తుకూరి మోహన్, జె పి.చెరువు, రూ.83,644/- చిక్కుడు చిన్న వెంకటేశ్వర్లు, పలుగుంటిపల్లి, రూ.99,000/- గోపవరం రంగస్వామి రెడ్డి, రాచర్ల, రూ.50,650/- పెట్ల జ్యోతిర్మై, కొత్తూరు, రూ.1,60,000/-

**కొమరోలు మండలం**

మజ్జారి చంద్ర వంశి, కురాకుపల్లి, రూ.3,21,421/- ఇసుకల సందీప్ రాజ్, కొమరోలు, రూ.2,15,502/-జక్కం ప్రసాద్, రౌతుపల్లి, రూ.95,059/- బత్తుల రాజేశ్వరమ్మ, తాటిచెర్ల, రూ.1,49,425/- తదితరులు చెక్కులు పొందారు.

# వైభవముగా పెద్దమ్మ తల్లి ముగింపు ఉత్సవం

**తిరునాళ్ళలో గుర్రం ఊరేగింపు కార్యక్రమంలో బోయల్ల ఆదిరెడ్డి**

**వైభవంగా గుర్రం ఊరేగింపు కార్యక్రమం**





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

మండల కేంద్రమైన సిఎస్ పురం లోని వడియరాజుపాలెం లోని పెద్దమ్మ తిరునాళ్ల లో భాగంగా చివరి రోజు గురువారం ముగింపు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు గుర్రము ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది సాంప్రదాయాల ప్రకారం గ్రామంలోని వంశస్థుడైన బోయల్ల ఆది నారాయణ రెడ్డి గుర్రంపై స్వారీ చేసుకుంటూ పెద్దమ్మతల్లి దేవాలయానికి తప్పెట్లు మేళాలు టపాసులు కాల్చుకుంటూ భారీ జన సందోహం మధ్య వైభవంగా పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరి మొక్కులు తీర్చుకున్నారు అలాగే సాంప్రదాయం ప్రకారం కమ్మవారు పూసల బండ్లతోగ్రామంలోని పురవీధుల్లో వాయిద్యాలతో పాట కచేరి నడుమ టపాసులు కాలుస్తూ యువకుల నృత్యాల నడుమ పెద్దమ్మదేవస్థానం కు చేరి మొక్కులు తీర్చుకున్నారు సాంప్రదాయాల ప్రకారం యాదవ బజారుకు చెందినవారు పూసలబండ్లతో వీధులలో ఊరేగింపుగా డీజే వాయిద్యాల నడుమ యువకుల నృత్యాల నడుమ పెద్దమ్మ తల్లి దేవస్థానం కు చేరి మొక్కులు తీర్చుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 6వ తేదీ రాజుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఆర్ డి ఎస్ ఎస్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత.**





**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

కొమరోలు మండలంలోని రాజుపాలెం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈనెల 6తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. రాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్న కారణంగా పనులు అంతరాయం కలువకుండా ఉండేందుకు వీలువ ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపి వేయవలసి వస్తున్నదని ఆయన చెప్పారు .రాజుపాలెం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని రాజుపాలెం, జి వెంకటాపురం ,ద్వారకచర్ల, ముక్తాపురం ,వెన్నం పల్లె, పాయలపల్లె, కృష్ణంపల్లి, నరసింహుని పల్లె, లింగారెడ్డి పల్లె, రౌతు పల్లె, బసవుపల్లె గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు. కావున ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు కోరారు.

# ఉద్యోగుల 14 ప్రధాన డిమాండ్ల సాధనే ధ్యేయం

**- జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి**

**- ఛలో విజయవాడ కార్యక్రమానికి వందలాదిగా తరలిన ఏపీజీఈఏ సభ్యులు**



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 05**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.ఆర్. సూర్యనారాయణ సారథ్యంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 ప్రధాన డిమాండ్ల సాధనే ధ్యేయంగా ఉద్యమిస్తామని ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎస్ ఎస్ కన్వర్షన్ హాల్ లో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కార్యక్రమానికి చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా నుండి వందలాది మంది ఉద్యోగస్తులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ఉద్యోగులకు ఇచ్చిన సందేశాన్ని తెలియజేస్తూ.. ప్రభుత్వానికి కొంత గడువు ఇస్తున్నామని తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. తదుపరి ప్రభుత్వ ఉద్యోగస్తులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీత భత్యాలు చెల్లింపునకు తగు చట్ట సవరణ చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, ట్రేడర్ రంగారెడ్డి, సహాధ్యక్షులు మసూద్ ఆలీ, ఒంగోలు పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఒంగోలు తాలూకా అధ్యక్షులు సురేష్, కార్యదర్శి శ్రీదేవి, మార్కాపురం పట్టణ అధ్యక్షులు చెంచిరెడ్డి, దర్శి తాలూకా అధ్యక్షులు ఎన్ వి సుబ్బారెడ్డి, గిద్దలూరు తాలూకా అధ్యక్షులు ఎస్వీ రంగయ్య, కంభం తాలూకా అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, ఎర్రగొండపాలెం తాలూకా అధ్యక్షులు జానీ భాష, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్

**పరీక్షలు...పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు: ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**

**మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ఐదుగురికి జైలు శిక్ష మరియు జరిమానా విధించిన గిద్దలూరు కోర్ట్**




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పోలీసు స్టేషన్ ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినారు. డ్రంకన్ డ్రైవింగ్ టెస్ట్ లలో పట్టుబడిన వారిని గిద్దలూరు కోర్ట్ ముందు హాజరు పరచగా, వారికి న్యాయస్థానం జైలు శిక్ష మరియు జరిమానా విధించారు. గిద్దలూరు టౌన్ పోలీస్ పరిధిలో గిద్దలూరు సీఐ సురేష్, సిబ్బంది కలసి డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీలు చేస్తుండగా పలువురిని పట్టుకోవటం జరిగిందని. డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఐదుగురిని గిద్దలూరు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు లో హాజరు పరచగా, గురువారం జడ్జి కె. భరత్ చంద్ర ఒక్కరికి మూడు రోజులు మరియు మరొకరికి ఐదు రోజులు జైలు శిక్ష, ఇద్దరికీ 10,000 రూపాయలు జరిమానా మరియు ఒకరికి 10,000 రూపాయలు జరిమానా మరియు ఆరు నెలల వరకు ఎలాంటి వాహనాలు పడకుండా లైసెన్స్ ను డిస్ క్వాలిఫై చేస్తూ ల్ జడ్జి తీర్పు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురైతే తీవ్రముగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి జరిగి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, మీ మీద ఆధారపడే కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# మన్నెపల్లి చిన్ని మృతి బాధాకరం.కదిరి బ్రదర్స్



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

సిఎస్ పురం గ్రామానికి చెందిన మన్నెపల్లి చిన్ని మృతి బాధాకరమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారథి అన్నారు.చిన్ని హైదరాబాద్ లో ప్రైవేట్ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.విషయ తెలుసుకున్న కదిరి ప్రకాశ్ రావు , కదిరి పార్థసారథి గురువారం సిఎస్ పురం లోని చిన్ని నివాస గృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్ని తమ కుటుంబంతో గత నలభై సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యునిగా ఉండేవారని అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. చిన్ని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్

**పరీక్షలు...పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు: ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**

**మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ఐదుగురికి జైలు శిక్ష మరియు జరిమానా విధించిన గిద్దలూరు కోర్ట్**




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పోలీసు స్టేషన్ ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినారు. డ్రంకన్ డ్రైవింగ్ టెస్ట్ లలో పట్టుబడిన వారిని గిద్దలూరు కోర్ట్ ముందు హాజరు పరచగా, వారికి న్యాయస్థానం జైలు శిక్ష మరియు జరిమానా విధించారు. గిద్దలూరు టౌన్ పోలీస్ పరిధిలో గిద్దలూరు సీఐ సురేష్, సిబ్బంది కలసి డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీలు చేస్తుండగా పలువురిని పట్టుకోవటం జరిగిందని. డ్రంకన్ డ్రైవింగ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఐదుగురిని గిద్దలూరు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు లో హాజరు పరచగా, గురువారం జడ్జి కె. భరత్ చంద్ర ఒక్కరికి మూడు రోజులు మరియు మరొకరికి ఐదు రోజులు జైలు శిక్ష, ఇద్దరికీ 10,000 రూపాయలు జరిమానా మరియు ఒకరికి 10,000 రూపాయలు జరిమానా మరియు ఆరు నెలల వరకు ఎలాంటి వాహనాలు పడకుండా లైసెన్స్ ను డిస్ క్వాలిఫై చేస్తూ ల్ జడ్జి తీర్పు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురైతే తీవ్రముగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి జరిగి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, మీ మీద ఆధారపడే కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# కొమ్మునూరులో అగ్ని ప్రమాదం

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం**

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

గిద్దలూరు మండలంలోని కొమ్మునూరు గ్రామంలో గురువారం ఒక గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదం వలన దాదాపుగా రెండు లక్షల రూపాయల గృహోకరణ వస్తువులు భస్మీపటల అయ్యాయని ఇంటి యజమాని వాపోయాడు.



# రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా అవార్డులకు ఎంపికైన ఎస్బిఎన్ఆర్ఎం పాఠశాల విద్యార్థులు

## ఎంపికైన విద్యార్థులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ





**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రతిభా అవార్డులకు కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం హైస్కూల్ కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత మార్చి నెలలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కొమరోలు లోని ఎస్ బిఎన్ ఆర్ ఎం హై స్కూల్ కు చెందిన ఎస్కే తహసీన్ 575 మార్కులు, బి వసంత కుమార్ 574 మార్కులు, కే శరణ్య 570 మార్కులు సాధించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లుగా అధికారులు ప్రకటించారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణమ్మ ప్రతిభ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో గొప్ప చదువులు చదువుతూ మంచి ఉజ్వల భవిష్యత్తు పొందాలని ఆమె విద్యార్థులను కోరారు .ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంధుగుల వెంకటసుబ్బారెడ్డి ,ఎస్ ఎల్ వి సొసైటీ చైర్మన్ బంధుగుల వెంకట రెడ్డి, ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ వై రేవతి, ఆ పాఠశాల ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొని ప్రతిభ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## గుళ్ళపాడు జంట హత్యల కేసులో 6గురు నిందితుల అరెస్టు కోర్టులో హాజరు పర్చిన పోలీసులు-రిమాండ్ విధించిన న్యాయమూర్తి



**మాచర్ల జూన్ 05 ( పెన్ పవర్ న్యూస్)**

వెల్దుర్తి మండలం, గుళ్ళపాడు గ్రామ సమీపంలో గత నెల 24వ తేదిన జరిగిన జంట హత్యల కేసులో నగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక న్యాయస్థానంలో పోలీసులు వారిని హాజను పర్చగా న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పోలీసులు గురజాల సబ్ జైలుకు తరలించారు. గత నెల 24వ తేదిన బోదిలవీడు గుళ్ళపాడు గ్రామాల మధ్యలో జరిగిన దాడిలో ఆవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావులు హత్యకు గురైనారు ఈ జంట హత్యల కేసు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. గుళ్ళపాడు గ్రామానికి చెందిన టిడిపి వర్గానికే చెందిన దగ్గర బంధువుల మధ్య తలెత్తిన రాజకీయ అడిపత్య విబేధాలే ఈ హత్యలకు కారణమని స్థానికులు తెలుపుతున్నారు. ఈ హత్యల వెనుక గల కారణలపై పోలీసులు విచారణ కోనసాగిస్తున్నారు. ఈ హత్య కేసులో నిందితులైన ఖవిశెట్టి శ్రీను, తోట వెంకటరామయ్య, తోట గురవయ్య, డోంగరి నాగరాజు, తోట వెండటేశ్వర్లు, గెల్లిపోగు విక్రమ్లను పోలీసులు ఆరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్.!



**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, మచిలీపట్నం, జూన్,05**

భావితరాలకు చక్కని పర్యావరణాన్ని అందించే పనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాగిత.కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం పెడన మండలం నందమూరు గ్రామంలో సచివాలయ ఆవరణలో కూటమి నాయకులు మరియు అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితేనే మానవజాతికి మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో పెడన జడ్పిటిసి అర్జా.వెంకట నగేష్, సర్పంచ్ పరసా. రాంబాబు, మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి. ప్రసాద్, సెక్రటరీ సీరం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమం

**మొక్కలు నాటిన గ్రంథ పాలకుడు ఆళ్ళ భాస్కర్ రావు**



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సిఎస్పురం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గ్రంథ పాలకుడు ఆళ్ళ భాస్కర్ రావు మొక్కలు నాటారు వేసవి విజ్ఞాన తరగతులలో భాగముగా విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీల వ్యాసరచన వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు దాత తోట శివకుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

## కెసిపి, పురపాలక శాఖల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

**మాచర్ల జూన్ 05 (పెన్ పవర్ న్యూస్ )**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాచర్ల పట్టణం, పరిసర గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కెసిపి సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాక్టరి, మైనింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్ ఆధ్వర్యంలో కమీషనర్ వేణుబాబు, సిబ్బంది రహదారుల ప్రక్కన పెద్దఎత్తున మొక్కలు నాటారు. కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం ఇవి నాగమణి ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. టిడిపి పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు అధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో రెసిపి జీఎం బి వెంకటరమణ, ది సుశీల, అధికారులు శ్రీనివాసరావు, ప్రసాద్, చంద్రశేఖర్ రామకోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి

# స్వర్ణ ఖడ్గం సమర్పణ

**- భక్తిలో ప్రహ్లాదుడు ఆదర్శం**

**- ఆధ్యాత్మిక ఉపన్యాస కులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు**




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తలు, భక్తులు గురువారం సూర్య కటారి (స్వర్ణ ఖడ్గాన్ని) ని సమర్పించి స్వామివారి పట్ల తమకు గల భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం నేత్ర పర్వంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తిలో ప్రహ్లాదుడు ఆదర్శం ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం హనుమంత వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు భక్త ప్రహ్లాద చరిత్ర పై ఉపన్యసించారు. భక్తిలో ప్రహ్లాదుడు అందరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.నవవిధ భక్తి మార్గాల గురించి భాగవతం చాటుతున్నదని ఎవరైనా తమకు నచ్చిన మార్గాన్ని అనుసరించి భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. భక్తి మార్గానికి ప్రహ్లాదుడు ఒక గొప్ప ఆదర్శమని పేర్కొన్నారు.భక్తి జ్ఞాన వైరాగ్య తత్వమోక్షమనే ఐదు అంశాల సమాహారమే భాగవతం అని పొన్నూరు వెంకట శ్రీనివాసులు వివరించారు. సంస్కృతంలో వేద వ్యాస మహర్షి రచించిన భాగవత మహా పురాణాన్ని



శ్రీరామచంద్రుని ఆదేశానుసారం పోతన మహాకవి తెలుగులో చక్కగా రచించి ధన్య జీవనుడయ్యాడని వెల్లడించారు. భాగవతంలోని కథలు మన పాపాలను నశింపజేసి పుణ్యాన్ని ప్రసాదిస్తాయని ఆయన తెలిపారు. భాగవతం మోక్షాన్ని ప్రసాదించే మహిమ గలిగిన కావ్యమని ప్రతి ఒక్కరు పోతన మహాకవి రచించిన భాగవత కథలను చక్కగా పఠించి శ్రీమహావిష్ణువు యొక్క అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. పొన్నూరు వెంకట శ్రీనివాసులును శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, కుమార ఆత్రేయలతో పాటు శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**6 వ తేదీన జరుగు కార్యక్రమాల వివరాలు:**

శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీవారికి శుక్రవార అభిషేకం, విశేష స్నపన తిరుమంజనం... సాయంత్రం ఊంజల సేవ,. శ్రీగిరి ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్ చే అన్నమయ్య కీర్తనల ఆలాపన జరుగుతాయి. భక్తులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## భారీ చోరీ కేసును ఛేదించిన పేట రూరల్ పోలీసులు

**రూ. 33.50 లక్షల సొత్తు స్వాధీనం**




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 05**

చిలకలూరిపేట : పేట రూరల్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 33.50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు చోరీ కేసులను ఛేదించినట్లు పల్నాడు జిల్లా పోలీసులు వెల్లడించారు. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామంలో జరిగిన ఓ ఇంట్లో చోరీ కేసును ఛేదించడంలో రూరల్ పోలీసులు కీలక పాత్ర పోషించారు. ఈ కేసులో 380 గ్రాముల బంగారం, 6 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 33,50,000 ఉంటుందని అంచనా. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్సై అనిల్‌లను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

# హోరా హోరీగా సి యస్ పురంలో ఎద్దుల బండ లాగుడు పోటీలు

# పోటీలను ప్రారంభించిన కదిరి బ్రదర్స్, ఆమంచి






**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 5**

చంద్రశేఖరపురం పట్టణంలోని వి ఆర్ నగర్ లో వెలసిన శ్రీ రాచూరి పెద్దమ్మ తల్లి తిరుణాల సందర్భంగా కాపునాయుడులు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలను కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశరావు, కదిరి పార్థసారథి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎంతో ఆనందంగా ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు సాంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలని అన్నారు. పోటీలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుండి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి 10 జతల ఎద్దులు వచ్చాయి బండలాగుడు పోటీలు హోరా హోరీగా కొనసాగాయి ఈ సందర్భంగా ఎద్దుల బండ లాగుడు పోటీలకు వచ్చిన యజమానులకు, పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు సంగిశెట్టి బ్రదర్స్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు ఈ పోటీల్లో మొదటి విజేతగా పెద్ద కొటాలకు చెందిన బొరెడ్డి కేశవరెడ్డి, రెండవ విజేత కడప జిల్లా మైదుకూరు కి చెందిన కుర్ర వెంకటేశు యాదవ్, మూడవ విజేత కడప జిల్లా రంగసాయిపల్లి గ్రామం నకు చెందిన మార్గాల వెంకటసుబ్బారెడ్డి, నాలుగవ విజేత నంద్యాల జిల్లా హుస్సేనాపురం గ్రామమునకు చెందిన రామ సుబ్బారెడ్డి, ఐదవ విజేత బాపట్ల జిల్లా బల్లికురవ కు చెందిన పావులూరి వీరస్వామి, ఆరవ విజేత నంద్యాల జిల్లా జిల్లెలా గ్రామమునకు చెందిన గోపిక దినేష్ రెడ్డి, 7వ విజేత అనంతపురం జిల్లా గార్ల గ్రామమునకు చెందిన రామాంజనేయులు, కన్సోలేషన్ బహుమతులు నంద్యాల జిల్లా ఆలగనూరు గ్రామమునకు చెందిన రోలీ మేడం, ప్రకాశం జిల్లా జేసీ అగ్రహారం గ్రామమునకు చెందిన లక్కు నాగ శివశంకర్, నంద్యాల జిల్లా పెసర వాయి గ్రామమునకు చెందిన సయ్యద్ కాలమ్ భాషా లకు అందజేశారు పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులకు బహుమతుల దాతలు తులాబందుల చలమయ్య నాయుడు, మారాసుల రోశయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు, తిరుమల శెట్టి కిరణ్ కుమార్ నాయుడు , ఆకుపాటి రమణయ్య, మన్నేపల్లి వెంకట నరసయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు, బోయిన మాలకొండయ్య జ్ఞాపకార్థం కుమారుడు రాయుడు, తోట ఆది లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అశోక్ నాయుడు, మన్నేపల్లి వెంకట్రావు జ్ఞాపకార్థం వారి కుమారులు తరపున బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమాలలో ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, బొబ్బూరి రమేష్, మాజీ ఎంపీపీ తోడేటి అల్లూరయ్య, సంగిశెట్టి పేరయ్య, పావలి తిరుపతయ్య (పెద్దాయన) సిఎస్పురం ఎంపీటీసీ మన్నేపల్లి వెంకట సుబ్బమ్మ పెద్దన్న, తోట అశోక్, పాలిశెట్టి సత్యం, తోట కనకయ్య, తులాబందుల రవి, తిరుమల శెట్టి రాము, తోట నారాయణ బహుమతులు దాతలు వారి కుటుంబ సభ్యులు, ఎద్దుల యజమానులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం




**కందుకూరు పెన్ పవర్, జూన్ 5**

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిఖిల్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం కందుకూరు కోర్టు కాంప్లెక్స్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్ నాయుడు, లైఫ్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, జనరల్ సెక్రటరీ సిహెచ్ మురళీధర్, సీనియర్ న్యాయవాదులు మహేశ్వరరావు, తిరుమల రావు, బ్రహ్మయ్య, మస్తాన్ వలి, రోశయ్య, షేక్ షంషుద్దీన్, జమీర్ బాషా, సుల్తాన్ బాషా, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# కొమరోలు లోని ఎం ఆర్ సిలో యోగ పై పోటీలు నిర్వహణ

**కొమరోలు ఎంఈఓ 2 ఆధ్వర్యంలో పోటీలు నిర్వహణ, విజేతలను ఎంపిక.**




**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కొమరోలు లోని ఎం ఆర్ సి భవనంలో యోగా పోటీలను నిర్వహించారు. కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ పోటీలలో మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులు తోపాటు పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి యోగా మాస్టర్ బొర్ర ఈశ్వరయ్య పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతల పేర్లను జిల్లా స్థాయి అధికారులకు పంపించామని ,ఆ మేరకు ఈనెల 21వ తేదీన నిర్వహించే జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతి ప్రధానం చేస్తారని ఎంఈఓ వెంకటరత్నం తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గట్టి కృషి

**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ స్పష్టం**

**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం గట్టి కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అనపర్తి విద్యాసాగర్ చెప్పారు గురువారం సాయంత్రం ఆయన నంద్యాలలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి హాజరై, తిరిగి విజయవాడకు వెళుతూ మార్గమధ్యంలోని పొదిలిలో కొద్దిసేపు ఆగారు ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నేత విద్యాసాగర్ స్థానిక ఎన్జీవో సంఘ భవనంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం ద్వారా, ప్రభుత్వానికి మంచి పేరు తేవడంతో పాటు ప్రజల మన్ననలు పొందాలని ఆయన కోరారు పొదిలికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ ను పొదిలి తాలూకా యూనిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి షేక్ సంధాని భాష, అసోసియేట్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షులు షేక్ కరీముల్లా, ఉద్యోగ సంఘ నాయకులు కే విజయ, కే రవిశంకర్ తదితరులు శాలువా తో సత్కరించి, పూలదండలతో సాదరంగా స్వాగతం పలికారు.



# డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

**మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న వంట నిర్వాహకులకు, సహాయకులకు సూచనలు సలహాలు ఇచ్చిన ఎంఈఓ రెండు బొర్రా వెంకటరత్నం.**




**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

మండలంలోని పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని వంట నిర్వాహకులు, సహాయకులు సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కొమరోలు మండల ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం కోరారు. బుధవారం కొమరోలు లోని మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో వంట నిర్వాహకులతో, సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ, వేసవి సెలవుల అనంతరం జూన్ 12 నుంచి పాఠశాలలను ప్రారంభిస్తారని ,అందువల్ల వంట నిర్వాహకులు సహాయకులు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన రుచికరమైన ,పోషక విలువలతో కూడిన వేడి వేడి ఆహారాన్ని తయారుచేసి అందించాలని ఆయన కోరారు. వంట చేసే సమయంలో వంటగది తో పాటు పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక వంట నిర్వాహకులు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం భోజనం తయారు చేసి విద్యార్థులకు సకాలంలో అందించాలని ఆయన కోరారు. పౌష్టికరమైన ,రుచికరమైన, సుచికరమైన భోజనం అందించినప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువుపై ఆసక్తి కనపరుస్తారని ఆయన సూచించారు. వంట చేసేముందు వంట పాత్రలను శుభ్ర పరచాలని, అధికారులు ,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ వంట తయారు చేసి విద్యార్థులకు అందించాలని ఆయన కోరారు. విద్యార్థుల నుంచి లేదా తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో మండలంలోని పాఠశాలలో పనిచేస్తున్న వంట నిర్వాహకులు ,సహాయకులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు ,,డేటా ఎంట్రీ ఆపరేటర్ రవీంద్ర రెడ్డి ,సిఆర్పిలు రామంజి ,పుల్లయ్య ,ఆంజనేయులు ,ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం

## యం.పి.డి.ఓ. రమణారెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "వన మహోత్సవం" కార్యక్రమాన్న గురువారం గిద్దలూరు మండలము లోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రము లో ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ అభివృద్ధి అధికారి రమణా రెడ్డి , డిప్యూటి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె.సి. చెన్నారావు లు చెత్త నుండి సంపద సృష్టి కేంద్ర ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయము ఆవరణం లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యం.పి.డి. ఓ . మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదనీ, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. అడవులను కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యం అన్నారు. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక్కరోజు మొక్కలు నాటే కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంచి పరిసరాలు ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుందని, అందుకే స్వచ్ఛ భారత్ లో భాగంగా మనం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టామని అన్నారు. చెత్తను ఇంధనంగా మారుస్తూ ప్రకృతిని కాపాడుతున్నామని, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ పొల్యూషన్ నిర్మూలన అంశాన్ని థీమ్ గా తీసుకున్నామని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా పనిచేద్దామన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకుందాం అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ యం. ఆర్.సి. బాబురావు, ఎ.పి.ఓ. రమణి,మండల కార్య పర్యవేక్షకులు డి. విజయ, సీనియర్ సహాయకులు ఐ. జె. తీర్థులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# బొట్ల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న దారపనేని



**పామూరు, పెన్ పవర్ జూన్05**

మండల పరిధిలోని తిరగండ్లదిన్నె గ్రామ వాస్తవ్యులు బొట్ల కోటయ్య (తెల్లయ్య) శ్రీమతి వెంకటనారాయణమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు చిరంజీవి పవన్ కళ్యాణ్ యాదవ్, సీఎస్ పురం మండలం కొవిలంపాడు (మిట్టపాలెం) వాస్తవ్యులు ఎలిక వెంకటనారాయణ శ్రీమతి బాలమ్మ దంపతుల కనిష్ట పుత్రిక లక్ష్మీ సౌభాగ్యవతి నాగ పద్మ ల వివాహ వేడుకలు గురువారం ఉదయం 4 గంటలకు తిరగండ్లదిన్నె గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని ముత్యాల పందిరిలో వేదమంత్రాల మధ్య కొత్త జీవితంలో అడుగుపెడుతున్న వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ బొట్ల నాగార్జున, మాజీ సర్పంచ్ మల్లెబోయిన గురుబ్రహ్మం, గోపి, మల్లె బోయిన బాల బ్రహ్మయ్య, రాజు, శివరామయ్య, బ్రహ్మయ్య, శివశంకర్ ,మేకల బాల గంగయ్య, బొట్ల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మట్లె రాహుల్ యాదవ్, యరశింగు రాయుడు,నుచ్చుపొద ఫిషర్ మెన్ కమిటీ మాజీ అధ్యక్షులు కౌలూరి ఖాజా రహమతుల్లా, గోసుల సురేంద్రబాబు (చంటి) నిజాముద్దీన్, బొట్ల వారి కుటుంబ సభ్యులు, మల్లె బోయిన వారి కుటుంబ సభ్యులు ఎలికా వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

# నూతన వధువరులకు మాజీ మంత్రి శిద్దా ఆశీస్సులు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

చీమకుర్తి శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో జరిగిన వెంకటేష్, అనూష వివాహానికి మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు హాజరై నూతన వధువరులకు ఆశీస్సులు అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

పెన్ పవర్
గుంటూరు | బాపట్ల | పల్నాడు

## గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆధ్వర్యంలో వన మహోత్సవం



**పెన్ పవర్ గుంటూరు జూన్ 5**

గుంటూరు జిల్లా అనంతవరం గ్రామంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్చవం, వన మహోత్చవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ తో కలిసి పాల్గొన్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం, డిప్యూటీ సీఎం, క్రిస్టినా మొక్కలు నాటారు.

## పేటలో బక్రీద్ సందర్భంగా గోవధపై నిషేధం

### మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 05**

ఈ నెల 7వ తేదీన జరుపుకోనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని చిలకలూరిపేట పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు . గోవధను నిషేధిస్తూ, పశు సంరక్షణ చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి .శ్రీహరి బాబు స్పష్టం చేశారు.యానిమల్ హస్బెండరీ యాక్ట్ నెం.11/1977 మరియు హైకోర్ట్ ఉత్తర్వులు - 30. 26505 తేదీ 23-12-2005 గోవధ నిషేధం చట్టం పశునిషేధిత సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయబడుతుందని ఆయన తెలిపారు. ఈ చట్టాల ప్రకారం ఆవులను, దూడలను, అలాగే ఇతర ఉపయోగకరమైన పశువులను వధించడం పూర్తిగా నిషేధించబడింది.ఈ ఆదేశాలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ పి .శ్రీహరి బాబు హెచ్చరించారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మొక్కలు నాటిన గుంటూరు 51వ డివిజన్ కార్పొరేటర్ భారతి..

### జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్మయ్య..








**పెన్ పవర్ గుంటూరు జూన్ 5**

ఈరోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ సూచనలతో 51 డివిజన్ కార్పొరేటర్ భారతి సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం 51 డివిజన్ 146వ సచివాలయం దగ్గర మొక్కలను నాటారు ఈ సందర్భంగా కార్పొరేటర్ భారతి మాట్లాడుతూ ప్రకృతిని రక్షించుకునే బాధ్యత తీసుకుందామని ప్రతి ఒక్కరం మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్ నిర్మించుకుందామని పిలుపునిచ్చారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమలకు శ్రీకారం చేపట్టడం మంచి ఆలోచన అని స్వచ్ఛ ఆంధ్ర హరిత ఆంధ్ర యోగ ఆంధ్ర వంటి కార్యక్రమాలు విజయవంతగా జరుగుతున్నాయని అన్నారు ఈ కార్యకరమంలో మాజీ కార్పొరేటర్ గోళ్ళ ప్రభాకర్ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య 39యూనిట్ ఇన్చార్జి నాయుడు మధు కోటపాటి ప్రభాకర్ మైనార్టీ నాయకులు రఫీ సచివాలయం ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి ఆర్ ఐ ఇన్స్పెక్టర్ సాంబశివరావు సచివాలయం సిబ్బంది టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నరు.

### డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 5**

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల బాపట్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణం యొక్క ప్రాధాన్యత తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా పర్యావరణం ప్రాధాన్యత తెలియపరిచేందుకు కళాశాలలోని విద్యార్థులకు " బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అనే థీమ్ గురించి వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్. వినోద విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 1972లో ఐక్యరాజ్యసమితి ప్రారంభించింది మరియు అప్పటి నుండి ఇది పరిశుభ్రమైన, పచ్చని మరియు ఆరోగ్యకరమైన భూమి కోసం అవగాహన పెంచడానికి మరియు చర్యను ప్రేరేపించడానికి ఒక ప్రపంచ ఉద్యమంగా మారింది. ప్రతి సంవత్సరం, ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఒక థీమ్ ఉంటుంది. ఇటీవలి సంవత్సరాలలో, ప్లాస్టిక్ కాలుష్యం, పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ మరియు వాతావరణ చర్యలపై దృష్టి సారించాము. మనం తీవ్రమైన పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచంలో జీవిస్తున్నాము - వాతావరణ మార్పు, ప్లాస్టిక్ కాలుష్యం, నీటి కొరత, అటవీ నిర్మూలన మరియు జీవవైవిధ్య నష్టం వంటివి మనందరినీ ప్రభావితం చేస్తాయి. నరికివేయబడిన ప్రతి చెట్టు, కలుషితమైన ప్రతి నది మరియు అంతరించిపోతున్న ప్రతి జాతి మనల్ని పర్యావరణ అసమతుల్యతకు దగ్గరగా తీసుకువస్తాయి, ప్లాస్టిక్ బ్యాగులు మరియు వాటర్ బాటిళ్లు వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను తిరస్కరించడంతో మార్పు ప్రారంభమవుతుంది అని తెలిపారు. వ్యాస రచన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు ఎం. ప్రీతి శ్రీ మొదటి బహుమతి, ఎం. హిమజ శ్రీ వైష్ణవి రెండవ బహుమతి, షేక్. అర్షా చాందిని మూడవ బహుమతి అందుకున్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే వివిధ రకాల 60 పూలు మరియు పండ్ల మొక్కలు కళాశాల ప్రాంగణంలో నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ వై అరుణ కుమారి, డాక్టర్ బ్లెస్సి సాగర్, డాక్టర్ నివేదిత, డాక్టర్ సునీత, డాక్టర్ దిలీప్ సేన్, నూకరత్నం, లావణ్య, డాక్టర్ ఫణీంద్ర తదితర బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవాడికి సంక్షేమ పథకాలు...

### రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం..

### జనసేన నాయకులు విన్నకోట సురేష్





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 5:**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా బాపట్ల నియోజకవర్గం లో జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రానికి సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భముగా..జనసేన పార్టీ అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలంలోని గణపవరం, నల్లమోతువారి పాలెం గ్రామాలలో మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. రాష్ట్రానికి సుపరిపాలన మొదలైందని బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో ముందుగా కేకు కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.. టపాసులు పేల్చి వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులు నెమరువేసుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి విన్నకోట సురేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని గద్దించి కుటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించిన అన్ని వర్గాల ప్రజలు ఏడాది కాలంలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. వైకాపా అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సాధించలేదని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. కుటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తుందని ఆయన తెలిపారు.. కుటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధించాలంటే కుటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా అవార్డులకు ఎంపికైన చల్లపల్లి విజయక్రాంతి విద్యార్థులు



**పెన్ పవర్ చల్లపల్లి, జూన్ 5**

2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. చల్లపల్లిలోని విజయక్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం సిఈసి పరీక్ష రాసి ఉత్తమ ఫలితాలు సాధించిన మట్టా శ్రీవల్లీ, పొట్లూరి త్రివేణి, కాగిత భార్గవిలు ఉత్తమ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం కరస్పాండెంట్ దుట్టా శివరామ ప్రసాద్ ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు వారు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మా కళాశాల విద్యార్థులను ప్రతిభా అవార్డులకు ఎంపిక చేయటం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ నెల 9వ తేదీన మచిలీపట్నంలో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో విద్యార్థులు అవార్డులు అందుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థినులకు మదర్ థెరీసా, స్వామి వివేకానంద చిత్రపటాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎంపీడీఓ

**పెన్ పవర్ కారంపూడి జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కారంపూడి మండలం, నరమాలపాడు గ్రామం లోని సచివాలయం ప్రాంగణంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ముందు గా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తేనే మానవజాతికి మనుగడ సాధ్యమవుతుందని అన్నారు.ఈ. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**పెన్ పవర్ గుంటూరు జూన్ 5**

వన మహోత్సవరం 2025 కార్యక్రమంలో గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ పశ్చిమ నియోజకవర్గం రెండవ మండలంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆవరణంలో ముఖ్యఅతిథిలుగా వల్లూరు జయప్రకాష్ నారాయణ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు పాల్గొని మొక్కలు నాటారు. అలాగే యావత్తు సమాజానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఇచ్చిన అమ్మ పేరుతో ఓమొక్క కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక మొక్కను నాటాలి



భవిష్యత్? తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందజేయడం మనందరి బాధ్యత. ఈకార్యక్రమంలో పాలపాటి రవికుమార్, కోలా రేణుకాదేవి, తోట శ్రీనివాసరావు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ దర్శనం శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, లక్ష్మణ్ బూతు అధ్యక్షులు సాయికృష్ణ రమణ 2వ మండల అధ్యక్షులు పెసల వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయానికి నూతన ట్రాక్టర్ డోజర్



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 5:**

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశములు మేరకు పట్టణ రోడ్డు మార్జినులు చదును చేయుటకు మరియు ఇతర ఇంజనీరింగ్ మరియు పారిశుధ్య విభాగమునకు సంబంధించి పట్టణంలో వివిధ పనులకు ఉపయోగపడు ట్రాక్టర్ డోజర్ ను కొనుగోలు చేయడం జరిగినది.

## మక్కెనని అభినందించిన మర్రి రాజశేఖర్



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 05:**

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ గా నేడు ప్రమాణం స్వీకారం చేసిన మక్కెన మల్లికార్జున రావు కి శుభాకాంక్షలు తెలియజేసి జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులతో ఉన్నారని వారికి అండగా ఉండాలని, వారికి రుణ సదుపాయాలు, ఎరువులు తదితర సహాయ సహకారాలు అందించాలని వారిని కోరిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఈ కార్యక్రమంలో వారి వెంట నాయుడు రమేష్, గడిపూడి దశరథరామయ్య, దొప్పలపూడి అప్పారావు, చాపలమడుగు రవి తదితరులున్నారు.

## మహిళ మృతి



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 05:**

నాదెండ్ల : మండలంలోని అమిన్‌సాహెబ్ పాలెం గ్రామంలో తీవ్ర విషాదం గ్రామానికి చెందిన 45 ఏళ్ల ఎస్టీ మహిళ రాపూరి చెంచమ్మ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.సంఘటన వివరాల ప్రకారం, రాపూరి చెంచమ్మ గ్రామంలోని మరొకరి ఇంట్లో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కరెంట్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఘటనతో అమిన్‌సాహెబ్ పాలెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## పర్యావరణ కాపాడుదాం పకృతికి సంరక్షణ కల్పిద్దాం

**పెన్ పవర బ్యూరోబాపట్ల జూన్5:**

పకృతిపై మనకు ఎంత హక్కు ఉందో దానిని కాపాడవలసిన బాధ్యత కూడా మనదేనని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్ రావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక రెడ్ క్రాస్ ఆఫీస్ దగ్గర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. రేపటి తరానికి, ఆరోగ్యవంతమైన సమాజానికి అందరూ కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనాతో పాటు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం ఆర్టిసి

# నెల్లూరు జోనల్ చైర్మన్ అన్నపురెడ్డి సురేష్ రెడ్డి

**మాచర్ల జూన్ 5 ( పెన్ పవర్ న్యూస్ )**

మాచర్ల: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు, కార్మికుల సంక్షేమం కోరకు అవసరమైన చర్యలను కూటమి ప్రభుత్వం తీసుకుంటున్నట్లు అర్టసి నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఆయన పట్టణంలోని ఆర్ టిసి గ్యారేజిని బస్టాండ్ ఆవరణను ఆకస్మిక తనిఖి చేపట్టారు. గ్యారేజిలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కులు వాటి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్యారేజి ఆదరణలో స్వచ్ఛ భారత్ బాగ జరుగుతున్నట్లు వివరించారు. అక్కడ కార్మికులకు ఉపయోగపడవలసిన టాయిలెట్స్ పని చేయకపోవటాన్ని గమనించి వెంటనే సివిల్ వర్క్ ఇంజనీర్లకు మరమ్మతులు చేయమని ఆదేశించారు. బస్సులకు అవసరమైన పదిరణాలు కూడ అవసరం మేరకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. బస్టాండ్ అవరణలో ప్రయాణికులతో మాట్లాడి మంచినీరు అందుబాటులో లేదని, టాయిలెట్స్ సరిగా లేవని గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిపో మేనేజరు కార్యాలయంలో విలేఖరులతో మాట్లానుతూ గత ప్రభుత్వం అ0సిని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులకు ఇవ్వవలసిన ప్రయోజనాలను పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారుల గుంతల వలన 15 సంవత్సరాలు సేవలు అందించాల్సిన బస్సులు 10 ఏళ్ళనే మూలన పడినట్లు తెలిపారు. ఆర్ టిసిని తాకట్లు పెట్టి తెచ్చిన నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడటం వలన రిటైర్డ్ కార్మికులకు సకాలంలో బెనిఫిట్స్ ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టిసి నిర్వీర్యం అయినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా అర్థిని ఉద్యోగుల ఆరోగ్య ఖర్చుల బాధ్యతను ప్రభుత్వం భరించేలా చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి 3వేల మంది సిబ్బంది అవసరమన్నారు. కరోనా సమయంలో అనేక సర్వీసులు రద్దు అయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో బ్యాటరీ బస్సులను



అందుబాటులోకి తీసుకోస్తున్నట్లు తెలిపారు. 950 పాత బస్సుల స్థానంలో నూతన బస్సులను తీసుకున్నట్లు తెలిపారు.

**టాయిలెట్స్ నిర్వహణ, బస్సుల క్లీనింగ్ నిర్వహణ డిఎం పరిధిలో ఉండాలి**

గతంలో మాదిరిగా టాయిరెల్స్ నిర్వహణ, ఐస్ల క్లీనింగ్ నిర్వహణ డిపో మేనేజర్ల పరిధిలో ఉంటే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆర్టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ అన్నపురెడ్డి సురేష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఒక్క కాంట్రాక్టర్ 4, 6 డిపోలను టెండర్ల ద్వారా దక్కించుకోని సరిగా పర్యవేక్షణ చేయటం లేదన్నారు. తాము బోర్డు మీటింగ్లో ఈ అంశాన్ని చర్చించి ప్రజలకు మేలు జరిగేలా చూస్తామన్నారు. ఆర్టిసి బస్టాండ్ అసరణలో పైపు లైన్ కూడా మరమ్మతులకు గురైనట్లు తెలిపారు.

**పోలీసు, మున్సిపల్ అధికారుల సహకారం అవసరం**

ఆర్టిసి బస్టాండ్ ఆవరణలో, ఆర్టిసి బస్టాండ్ సమీపంలో మూరుగునీరు పొరుడల సరిగా ఉంటే ప్రయాణికులకు చెడు వాసన రాధని ఆర్టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో చెడు వాసన వస్తున్నట్లు ప్రయాణికులు తమకు తెలిపినట్లు తెలిపారు. మున్సివల్ అధికారులకు స్థానిక డిపో అధికారులు ఫిర్యాదు చేస్తున్నా మున్సిపల్ అధికారులు తమతో సమన్వయం చేసుకోని మురుగు తొలగింపులో సరిగా స్పందించటం లేదన్నారు. వారు మురుగు తొలగిస్తే ప్రయాణికులకు చెడు వాసనరాదన్నారు. మురుగు తొలగింపులో మున్సిపల్ అధికారులు మరింత సహకారం అందించాల్సి ఉందన్నారు. పోలీసులు కూడ తమ సిబ్బందితో కలిసి జాయింట్ అపరేషన్ చేస్తే ప్రయాణికులను అక్రమంగా తరలించే ఆటోలు, ఇతర వాహనాలను కట్టడి చేయవచ్చునని తెలిపారు. రైల్వే స్టేషన్స్, ప్రముఖ కూడళ్ళలో పోలీసుల సహకారం తమరు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజరు బత్తుల వీరాస్వామి, బిజెపి నాయకులు పోడూరి కాశీపతి, ఓర్పు క్రాంతికుమార్, బోయ నాగి రెడ్డి, వంశీక్రిష్ణ, డిపో సిబ్బంది. షేక్ మహమ్మర్ పల్లి, చంద్రారెడ్డి, చిన్నయ్య, సోమయ్య, చెన్న తదితరులు పాల్గోన్నారు.

### పర్యాటక ప్రాంతంగా

# పులిగడ్డ ఆక్విడెక్టు అభివృద్ధి



**పెన్ పవర్ జూన్ 5**

వృక్షాల సంరక్షణ, వాల్టా చట్టం అమలుతోనే పర్యావరణ పరిరక్షణ దినోత్సవ లక్ష్యం నెరవేరుతుంది. మోపిదేవి వార్పు వద్ద "ఐ లవ్ దివిసీమ" బోర్డు ప్రారంభించి, ఉద్యానవనంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే పులిగడ్డ ఆక్విడెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం మోపిదేవి వార్పు వద్ద "ఐ లవ్ దివిసీమ" నూతన బోర్డులను, ఉద్యానవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలి యుగంధర్ ఆర్థిక సహకారం రూ.40వేలతో ఈ ఉద్యానవనంలో అశోక, బ్లాక్ పాండా, రెడ్ మిర్చి, స్టెప్డ్ ట్రీ, ఫోక్స్టయిన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారి కాలం నుంచి ఒకవైపు కృష్ణానది, మరోవైపు దివిసీమకు సాగునీరు అందించే ఆక్విడెక్టులతో ప్రకృతి రమణీయతకు నిలయంగా ఈ ప్రాంతం ఉండేదన్నారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లోపం, పాలకుల నిర్లక్ష్యంతో కళా విహీనంగా తయారైందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వంలో ఒకవైపు రూ.కోటీ పది లక్షలతో పులిగడ్డ ఆక్విడెక్ట్ సమగ్ర అభివృద్ధి, మరోవైపు వార్పు వద్ద జాతీయ రహదారిపై, కృష్ణా డబుల్ లైన్ కరకట్టపై వెళ్లే ప్రయాణికులకు, పర్యాటకులకు ఆహ్లాదభరిత వాతావరణం కనిపించేలా ఐ లవ్ దివిసీమ బోర్డులు, ఉద్యానవనం ఏర్పాటు చేసి మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ ఉద్యానవనంలో త్వరలో పూలమొక్కలు కూడా నాటించి, ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిధిలో పచ్చదనం పెంచేందుకు దాతల సహకారంతో మరిన్ని మొక్కలు నాటుతామన్నారు. తద్వారా ఆక్విడెక్ట్ ప్రాంతం సర్వాంగ సుందరంగా పర్యాటకులను సేద తీర్చేలా రూపుదిద్దుతామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఉపాధి పథకం ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటుతోందన్నారు. అయితే నాటిన ప్రతి మొక్కను సంరక్షించవలసిన బాధ్యత అధికారులు నిర్వర్తించాలని సూచించారు. అనేకమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం పచ్చదనాన్ని మట్టుబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం ఎక్కడైనా ఒక చెట్టు కొట్టాలన్నా అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అధికార యంత్రాంగం నిద్ర మత్తు వదిలితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. వాల్టా చట్టాలు కచ్చితంగా అమలు చేసినప్పుడే పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించిన తాలూకు ఫలితాలు భావితరాలకు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఇరిగేషన్ శాఖ డీఈఈ ఎస్.అరుంధతి, ఏఈఈలు పొన్నూరు రవితేజ, దోవారి విజయ్ కుమార్, తానేటి ప్రసాద్, మొక్కల దాత మండలి యుగంధర్, కూటమి నాయకులు బండే రాఘవ, మండలి శేషు, మండలి శివప్రసాద్, మండలి సుధీర్, చెన్ను గాంధీ, నాగిడి రాంబాబు, మండలి రామకోటి, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పేదవాడికి సంక్షేమ పథకాలు...

# రాష్ట్రభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం..

### జనసేన నాయకులు విన్నకోట సురేష్




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 5:**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా బాపట్ల నియోజకవర్గం లో జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వ ర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రానికి సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భముగా..జనసేన పార్టీ అధ్యక్షుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలంలోని గణపవరం, నల్లమోతువారి పాలెం గ్రామాలలో మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. రాష్ట్రానికి సుపరిపాలన మొదలైందని బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో ముందుగా కేకు కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.. టపాసులు పేల్చి వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు..కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులు నెమరువేసుకు న్నారు.. అనంతరం ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి విన్నకోట సురేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని గద్దించి కుటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించిన అన్ని వర్గాల ప్రజలు ఏడాది కాలంలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. వైకాపా అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సాధించలేదని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. కుటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తుందని ఆయన తెలిపారు.. కుటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధించాలంటే కుటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైదవోలులో అసిస్ట్, ఐటిసి బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 05**

మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, మైదవోలు గ్రామం పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన వినూత్న కార్యక్రమాలతో పచ్చదనాన్ని చాటింది. అసిస్ట్ మరియు ఐటిసి బంగారు భవిష్యత్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు జరిగాయి.ఈ వేడుకల్లో భాగంగా, పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేసే పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ పోస్టర్లు ప్లాస్టిక్ కాలుష్యం తగ్గించడం, మొక్కలు నాటడం, మరియు పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై దృష్టి సారించాయి. అనంతరం, గ్రామ పరిధిలో మొక్కలు నాటడం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా పెట్టుకున్నారు.పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానికులు, విద్యార్థులు, మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పర్యావరణానికి సంబంధించిన నినాదాలు చేశారు. చివరగా, రోడ్లను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించి, పారిశుధ్య ప్రాముఖ్యతను చేతల్లో చూపించారు.ఈ కార్యక్రమాలకు మండల పరిషత్ అధికారిని (ఎంపీడీవో) వి హేమలత దేవి, ఐటిసి ఫ్యాక్టరీ మేనేజర్ కట్టా. పూర్ణచందర్, మేనేజర్ బాలాజీ, మరియు గ్రామ టీడీపీ నేతలు పోతురాజు వంటి ప్రముఖులు తదితరులు ఉన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**కీర్తిశేషులు శ్రీ చిముటురి రాణి రెండవ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం**




**పెన్ పవర్ జూన్ 5**

చల్లపల్లి గ్రామ వాస్తవ్యులు చిముటురి వీరబాబు తన భార్య రెండోవ వర్ధంతి సందర్భంగా చల్లపల్లి పార్వతమ్మ తోటలోని ఆదరణ వృద్ధ ఆశ్రమంలో తన కుమారుడు మనీ మరియు కూతురు శిరీష మనమల్లు నితిన్, సాయి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు వృద్ధులకు స్వయంగా తానే భోజనాలు వడ్డించి దగ్గర ఉండి ఎవరికి ఏమి కావాలో అడిగి తెలుసుకుని ఇంటిలో తయారు చేసిన భోజనాలు ప్రేమ ఆప్యాయతతో వృద్ధులకు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సకహారాలు అందించాలని ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో పుట్టినరోజు వేడుకలు వర్ధంతి కార్యక్రమాలు ఆశ్రమాలలో వృద్ధులతో కలిసి జరుపుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, వీరబాబు అల్లుడు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఊపు ఎక్కడా....

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ఈ ఏడాదిలో వైసీపీ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి లభించలేదు. 175 నియోజకవర్గాలకు గాను కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటయిన శాసనసభ సమావేశాలకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. దీంతో ప్రజాసమస్యలను శాసనసభలో ప్రస్తావించేవారు లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానని జగన్ పట్టుబట్టడం కూడా ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళతామని అనడం సరికాదన్న కామెంట్స్ బాగానే వినిపిస్తున్నాయి,శాసనసభలో వైసీపీ వాయిస్ లేకుండా పోయింది. ఇది జగన్ పార్టీకి మైనస్ అని చెప్పాలి. అదేసమయంలో జగన్ ఏడాది నుంచి బెంగళూరు నుంచి విజయవాడ కు ట్రిప్పులు వేస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే నేతలకు అందుబాటులో ఉంటున్నారు. స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడంతో ఆయన తరచూ లోకల్ లీడర్లతో భేటీ అవుతున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా స్థానిక సంస్థలన్నీ కూటమి పరమయిపోయాయి. ఇక ఉగాది నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు తన పర్యటనను వాయిదావేసుకుంటూ వెళుతున్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో తమ వారిపై నమోదవుతున్న కేసుల విషయంలోనే జగన్ కొంత పట్టించుకుంటున్నారు. ఏడాది నుంచి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశం కాలేదు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. చివరకు తన సొంత జిల్లా కడపలోనూ నేతలతో ఆయన సమావేశమవ్వడం తక్కువేనని అంటున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న జగన్ మాత్రం నేతలకు సంబంధించి ఎటువంటి భరోసా ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో ఇష్టారీతిన నియోజకవర్గాలను మార్చేశారు. నేతలకు పట్టున్న నియోజకవర్గాల నుంచి బయటకు పంపారు. ఈ ప్రయోగం విఫలమయిందని తెలిసినా తిరిగి అక్కడ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో ఏడాదిగా ఆ యా ప్రాంతాల్లో క్యాడర్ అయోమయంగా ఉంది.మరొక వైపు అప్పుడప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేస్తున్నప్పటికీ, మీడియా సమావేశాలు పెడుతున్నప్పటికీ జగన్ ఇంకా పూర్తి స్థాయిలో జనానికి అందుబాటులోకి రాలేదు. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికే అధికారంలో లేనప్పుడు కూడా పరిమితమయ్యారు. రైతుల సమస్యలపై కొంత వెళుతున్నప్పటికీ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేసిన తరహాలో దీక్షలు, ధర్నాలు వంటివి చేయకపోవడం పార్టీ క్యాడర్ లో ఇంకా ఊపు తెప్పించలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది జనంలోకి బలంగా వెళ్లగలిగేలా మాత్రం ఆయన చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదన్నది మాత్రం యదార్థం.ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో కనీసం యాభై శాతం కూడా సక్సెస్ కాలేకపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

# వేగంగా కొనసాగుతున్న నకిలీ నెయ్యి కేసు



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డులో వినియోగించే నెయ్యి లో కల్తీ జరిగిందినే కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కి పిఏ గా పని చేసిన అప్పన్నకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. బుధవారం నుంచి మూడు రోజులు పాటు తిరుపతి లోని సిట్ కార్యాలయంలో అప్పన్నను సీట్ అధికారులు ప్రశ్నించనున్నారు. నత్వరలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి, మాజీ ఈవో ధర్మారెడ్డికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. టీటీడీ మాజీ జేఈవో కి సహ ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చి విచారించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. 2024 సెప్టెంబర్లో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతు కొవ్వు , చేప నూనెతో కూడిన కల్తీ నెయ్యి ఉపయోగించినట్లు ఆరోపించారు. దర్యాప్తు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. అయితే, సిట్ దర్యాప్తుపై పారదర్శకత లేని ఆరోపణలు రావడంతో, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆధ్వర్యంలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేశారు. ఈ బృందంలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉన్నారు.ఈ కేసులో ఇప్పటివరకు 15 మందిని నిందితులుగా పేర్కొనగా, వీరిలో 6 మందిని సిట్ అరెస్టు చేసింది. తమిళనాడులోని ఏఆర్ డెయిరీ, ఉత్తరాఖండ్లోని బోలేబాబా డెయిరీ, యు తిరుపతిలోని వైష్ణవి డెయిరీకి చెందిన వ్యక్తులు అరెస్టు అయ్యారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో తెర వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై సిట్ విచాణ జరుపుతోంది. కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ నిబంధనలను మార్చిన సూత్రధారులపై సిట్ దృష్టి సారించింది. ఏఆర్ డెయిరీకి టెండర్ దక్కేలా వైఎస్ఆర్సిపి హయాంలో టీటీడీ పాలకవర్గంలోని కొంతమంది సభ్యులు, అధికారులు పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.లభించిన ఆధారాలతో %ుణ% మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నకు సిట్ నోటీసులు జారీ చేసి, ప్రశ్నిస్తున్నారు. అప్పన్నతో పాటు మరో ఆరుగురు టీటీడీ ఉద్యోగులను కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రాథమికంగా లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని గుర్తించారు. ఈ క్రమంలో అక్రమాలు ఎవరు చేశారు.... అవినీతి ఎలా జరిగింది.. కల్తీ నెయ్యిలో ఏమేమి కల్తీ అయ్యాయన్నది వెల్లడి కావాల్సి ఉంది. ఇవన్నీ వెల్లడి అయితే .. దర్యాప్తు నివేదికను సీబీఐ సుప్రీంకోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో హర్యానా గ్యాంగ్ కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** చిత్తూరు జిల్లా కుప్పంలో హర్యానాకు చెందిన దొంగల ముఠా రెచ్చిపోయింది. కుప్పం మీదుగా సరిహద్దు దాటుతుండగా.. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కారులో వెళ్తున్న దొంగలు పోలీసులను తొక్కించబోయారు. పోలీసులు కాల్పులు జరిపి వారిని ఆపడానికి ప్రయత్నించారు. అనంతరం దొంగలు కారును వదిలి పారిపోగా.. పోలీసులు వారి కోసం గాలిస్త్తున్నారు. కుప్పం డీఎస్పీ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కృష్ణగిరి – పలమనేరు నేషనల్ హైవేపై తనిఖీలు చేపట్టారు. తంబిగానిపల్లె చెక్‌పోస్ట్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాత్రి 10.30 గంటలకు ఒక కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కార్పియో కారును ఆపారు.ఆ కారులో తనిఖీలు చేసేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లగా.. వెంటనే దొంగలు కారును వెనక్కి పోనిచ్చి వారిపైకి ఎక్కించే ప్రయత్నం చేశారు. కానిస్టేబుళ్లు అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన సీఐ మల్లేష్ యాదవ్ కాల్పులు జరిపారు. తన సర్వీసు రివాల్వర్‌తో కారు డ్రైవర్ కాలుకు తగిలేలా కాల్చారు. కాల్పులు జరిపిన తర్వాత దొంగలు కారుతో సహా అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటనే టీమ్‌లుగా ఏర్పడి వారి కోసం గాలించారు. కారు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు దాటకపోవడంతో కుప్పం పరిసర ప్రాంతాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితులు పరమసముద్రం చెరువు దగ్గర కారును వదిలి పారిపోయారన్నారు పోలీసులు.హత్యాయత్నం కింద దొంగలపై కేసు నమోదు చేశామన్నారు డీఎస్పీ పార్థసారథి. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నామని.. ఈ క్రమంలోనే డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించామన్నారు. ఒకవేళ ఎక్కడైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న వివరాలను బట్టి కారులో ఐదుగురు ఉన్నారన్నారు. దొంగలు హర్యానాకు చెందిన ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. వీరు గతంలో చాలా రాష్ట్రాల్లో దొంగతనాలు చేశారంటున్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో డ్రైవర్‌కు గాయాలయ్యాయంటున్నారు. నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మంత్రులకు సుతి మెత్తని క్లాస్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులు మాట్లాడే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రుల మధ్య సమన్వయం కొరవడితే నవ్వుల పాలవుతామని, ఒకే అంశంపై మాట్లాడేటప్పుడు అందరూ ఒకే విధంగా మాట్లాడితే ప్రజల్లోకి సరైన పద్ధతిలో వెళుతుందని చంద్రబాబు అన్నారు. అంతే తప్ప ఎవరికి వారు ఒకే అంశంపై వేర్వేరు విధంగా మాట్లాడితే ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకత పెంచుకునే అవకాశముందని చెప్పారు. అందుకే మాట్లాడే ముందు మంత్రులు సబ్జెక్ట్ పై అవగాహనకు వచ్చి మాట్లాడాలని, సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా మంత్రులందరూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారుకొందరు మంత్రుల పనితీరును... అయితే మంత్రులు ఇంకా పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని, కేవలం శాఖపరమైన విషయాలు మాత్రమే కాకుండా పార్టీ సంబంధిత విషయాలను గ్రౌండ్ లెవెల్లో ఏం జరుగుతుందన్నది ఎప్పటికప్పుడు తెలుసుకుని తమకు కేటాయించిన జిల్లాల్లో పరిస్థితులను తమకు తెలియజేయాలని కోరారు. అలాగే కార్యకర్తలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కూడా చంద్రబాబుఅన్నారు. ఈ ఏడాదిలో అనేక మంది కొత్తగా మంత్రి పదవులు చేపట్టారని, వచ్చేఏడాదికి పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని చంద్రబాబు సూచించారు. చాలా మంది మంత్రుల పనితీరు బాగుందని, అయితే కొందరు మాత్రం కొంత తమ వ్యవహారశైలితో పాటు పనితీరులో కూడా మార్పులు చేసుకోవాలని ఆయన అన్నారు... ప్రత్యర్థి పార్టీ నేతల అరెస్ట్ ల గురించి ఆలోచించవద్దని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసి ఉంటే ఖచ్చితంగా అరెస్ట్ అవుతారని చంద్రబాబు తెలిపారు అది జగన్ అయినా మరొకరయినా ఒకటే న్యాయం ఉంటుందని అన్నారు. నిత్యం ప్రజల్లో మమేకమవుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సోషల్ మీడియాలో పాటు పత్రికల్లో వచ్చే వార్తలకు కూడా మంత్రులు స్పందించాలని, లేకపోతే అందులో వచ్చే వార్తలు నిజమని ప్రజలు భావించే అవకాశముంటుందని, ఆ ఛాన్స్ ఎవరూ తీసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ముందుండాలని కూడా చంద్రబాబు మంత్రులను ఆదేశించారు.



**ఏడాది పాలనపై బాగుందనే ఫీలింగ్**

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. ఈ ఏడాది పాలనలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే కూటమి ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించడం లేదు. ఏడాది మాత్రమే కావడంతో ప్రజలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. అదే సమయంలో జగన్ ఐదేళ్ల పాలనతో బేరీజు వేసుకుని చూస్తే ఇటు పరవాలేదని చెప్పలేని పరిస్థితి. అటు బాగా లేదని అనలేని స్థితి ఉంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ప్రతి ఒక్కరి మనసులో అభివృద్ధి జరగాలని ఆశిస్తారు. అదే సమయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఉండాలని భావిస్తారు. అయితే ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల అంచనాలు, ఆలోచనలు అందుకోలేకపోయిం దన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. రోడ్లు బాగుండాలని కోరుకుంటారు. పరిశ్రమలు రావాలని అనుకుంటారు. పది మందికి ఉపాధి అవకాశాలు దక్కాలని ఆశిస్తారు. నిరుద్యోగ సమస్య లేకుండా తక్కువ ధరలకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సహజంగా కోరుకుంటారు. ఈ విషయాల్లో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడతాయి. ఎందుకంటే వచ్చిన వెంటనే రహదారులను మరమ్మతులు చేశారు. పరిశ్రమలు కూడా ఒక్కొక్కటి వస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగయితాయన్న భావన ప్రజల్లో ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో నిధులు సమకూరడంతో పాటు పరిశ్రమలు కూడా త్వరగానే వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే మిగిలిన తొమ్మిది నెలల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుంటే పరవాలేదని పించేలా ఉందని ప్రజలు అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలపై మాతరం పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను నాలుగు వేల రూపాయలకు పెంచడం ఒకే. అదే సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అందచేస్తున్నారు. అంతకు మించి రైతులకు, మహిళలకు, విద్యార్థులకు సంబంధించిన పథకాలను గ్రౌండ్ చేయలేకపోవడంతో ఒకింత ఆ వర్గం ప్రజలు మాత్రం పెదవి విరుస్తున్నారు. జగన్ హయాంలో తమ బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఉండేవని, కానీ కూటమి సర్కార్ ఏర్పాటయిన ఏడాదిలో అకౌంట్ లోకి పైసా పడకపోవడంపై ఒకింత అసంతృప్తి కనిపిస్తుంది. కానీ చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని, వరసగా అన్ని పథకాలను అమలు చేస్తామని, ఇచ్చిన హామీలతో క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పడం ఒకింత ఊరటనిచ్చే అంశమే. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అందచేయనున్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. కానీ ఒకేసారి కాకుండా విడతల వారీగా జమ చేస్తామని చెప్పడం ఒకింత ప్రజల్లో అసహనంకలుగుతుంది. రెండు నుంచి మూడు వేలు వస్తే ఉపయోగం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందిస్తుండటంతో రానున్న కాలంలో ఈ ఒపీనియన్ లో మార్పు వచ్చే అవకాశముందన్న భావనలో టీడీపీ నేతలున్నారు.

# ఇమేజ్ పెరిగిందా...డ్యామేజ్ అయిందా

**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు. తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు. . నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# దారి మళ్లుతున్న రేషన్ బియ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** రేషన్ సరకులు పక్కదారి పట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లోనే నేరుగా రేషన్ ఇస్తోంది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రేషన్ బియ్యం వద్దు అన్న వాళ్లకు నిత్యవసర సరకులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇలా చేయడం వల్ల బియ్యం పక్కదారి పట్టకుండా చూడొచ్చని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తెలిసిందే. ఎన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నా చట్టాల్లోని లోపాలని వినియోగించుకొని కేటుగాళ్లు తప్పించుకుంటున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం వల్ల ఇలాంటి దందా విపరీతంగా పెరిగిపోయిందని ప్రభుత్వం షాపుల ద్వారా పంపిణీ చేపట్టింది. కానీ ఇలా పంపిణీ చేపట్టిన తొలి రోజే భారీ సంఖ్య రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం మాఫీ వెనుకాల ఉన్న వారి ఎత్తులు ఒక రకంగా ఉంటే... రేషన్ బియ్యం అవసరం లేని వాళ్లు వాటిని అమ్ముతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో తిరిగి ప్రజలతో మాట్లాడిన శాసనసభా కమిటీ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యశ్రీ తోపాటు ఇతర ప్రభుత్వ పథకాల కోసం కొందరు రేషన్ కార్డు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి వారికి రేషన్ అవసరం లేదని అందుకే వారు ఆ రేషన్ తీసుకొని అమ్మేయడమో లేదా రేషన్ డీలర్‌కు వదిలేయడంతో వాళ్లు అమ్ముకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికెట్టేందుకు కేవలం ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యశ్రీ కోసమే రేషన్ కార్డు తీసుకుంటున్న వారికి వేరే కార్డు ఇస్తే సరిపోతుందన్నారు. ఆరోగ్య శ్రీకు వేరుగా కార్డు ఇస్తే



వాళ్లకు రేషన్ కార్డు కట్ చేయవచ్చని తెలిపారు. ఫలితంగా రేషన్ పక్కదారి పట్టే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వారి సూచనలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నేరుగా రేషన్ కార్డు కట్ చేస్తే వ్యతిరేకత వస్తుందని ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తోంది. అలాంటి వారందరి నుంచి ముందే సమాచారం సేకరించి వారికి నిత్యవసర సరకులు ఇవ్వబోతున్నారు. బియ్యంం వద్దంటే వారికి కందిపప్పు, నూనెతోపాటు ఇతర సరకులు ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వంపై భారం పడినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారు. నలుగురు ఉండే కుటుంబంపై ప్రభుత్వం బియ్యం ఇచ్చేందుకు దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చు పెడుతుంది. అదే ఖర్చు నిత్యవసరాలు ఇవ్వగలిగితే వారికి కూడా మేలు జరుగుతుందని అంచనా వేస్తోంది. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు అభిప్రాయసేకరణ చేసిన తర్వాత ఇంప్లిమెంట్ చేయనున్నారు. భవిష్యత్‌లో సన్నబియ్యం కూడా ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉన్నట్టుంది. అప్పుడు మాఫియా మరింత రెచ్చిపోతుందని ఇప్పటి నుంచే దాన్ని కట్టడి చేయాలనే ఆలోచన ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇక్కడ రేషన్ బియ్యాన్ని బ్లాక్‌లో కొంటున్న వాళ్లంతా వాటిని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసుకున్నారు.

## ఆర్సీబీ విజయోత్సవాలు అంత హడావుడిగా ఎందుకు నిర్వహించారు?: మదన్‌లాల



**హైదరాబాద్ పెన్ పవర్:** చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళిక లేకుండా అంత హడావుడిగా ఈ కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని భారత మాజీ క్రికెటర్ మదన్‌లాల్ ప్రశ్నించాడు. ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 18వ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఇదే వారికి తొలి టైటిల్. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ యాజమాన్యం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. అయితే మైదానం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతి చెందారు. పలువురు గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనపై 1983 వరల్డ్ కప్ గెలిచిన నాటి భారతజట్టులో (%ఘువ ×అఽఖు%) సభ్యుడైన మదన్‌లాల్ స్పందించాడు. విజయోత్సవ ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ ఆర్సీబీని తప్పు బట్టాడు. అంత హడావుడిగా ఈ కార్యక్రమాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించాడు. 'మీరు గత రాత్రి అహ్మదాబాద్‌లో సంబరాలు చేసుకున్నారు. మరుసటి రోజే బెంగళూరులో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించడానికి ఇంత తొందరపాటు ఎందుకు? సరైన ప్రణాళిక లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల అనవసరంగా పదకొండు మంది తమ ప్రాణాలు కోల్పోయారు' అని మదన్ లాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడంతో తమ అభిమాన క్రికెటర్లను చూడటానికి లక్షల సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కానీ స్టేడియం సామర్థ్యం కేవలం 35 వేలు. దీంతో మైదానం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు వేడుకను 20 నిమిషాలకు కుదించి, ముగించారు.

ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విజయోత్సవం జరిగిందని తెలిపారు. బెంగళూరు జట్టు కాబట్టి తాము కార్యక్రమంలో పాల్గొన్నామని ఆయన విలేకరులతో అన్నారు.

# ఇద్దరూ ఇద్దరే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో అత్యంత గొప్ప కెప్టెన్‌గా పేరున్న మహేంద్రసింగ్ ధోనీ కొన్నేళ్ల ముందే పగ్గాలు వదిలేశాడు. ఈ సీజన్‌కు తాత్కాలికంగా సారథ్య బాధ్యతలు నిర్వర్తించినా తనదైన ముద్ర వేయలేకపోయాడు. రోహిత్ శర్మ గత సీజన్లోనే కెప్టెన్సీకి దూరమయ్యాడు. కోహ్లి తనకు తానుగా మూడేళ్ల ముందే పగ్గాలు వదిలేశాడు. దిగ్గజ స్థాయి ఆటగాళ్లు ఒక్కొక్కరుగా కెప్టెన్సీకి దూరమైన ఐపీఎల్‌లో ప్రస్తుతం యువ సారథులదే హవా. ముఖ్యంగా ఈ సీజన్లో ఇద్దరు కుర్ర కెప్టెన్లు అందరి దృష్టిని తమ వైపు తిప్పుకున్నారు. ఇప్పటికే సారథిగా తానేంటో రుజువు చేసుకున్న ఓ కెప్టెన్, ఈసారి మరింత రాటుదేలితే.. మరో కెప్టెన్ అరంగేట్రంలోనే అదరగొట్టేశాడు. ఆ ఇద్దరే శ్రేయస్ అయ్యర్, రజత్ పాటీదార్.ఐపీఎల్ ఆరంభమవుతుంటే.. టైటిల్ గెలిచే జట్టేది, ప్లేఆఫ్ చేరే జట్లేవి అన్న అంచనాలు మొదలవుతాయి. కప్పు గెలవడం సంగతి అటుంచితే.. చాలా ఏళ్లుగా ప్లేఆఫ్ చేరగల జట్టుగానూ ఎవ్వరూ పరిగణించని టీమ్ ఏదైనా ఉందీ అంటే.. అది పంజాబే! 17 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఆ జట్టు ఒక్కసారే ఫైనల్ ఆడింది. ఓసారి సెమీస్ చేరింది. దశాబ్ద కాలంగా అసలు ప్లేఆఫ్ ముఖమే చూడలేదు. అలాంటి జట్టు ఈసారి లీగ్ దశను అగ్రస్థానంతో ముగించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ముంబయిని ఓడించి ఫైనల్లోనూ అడుగుపెట్టింది. తుది పోరులోనూ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో టైటిల్‌కు అత్యంత చేరువగా వచ్చింది. కానీ స్వల్ప తేడాతో కప్పును కోల్పోయింది. పంజాబ్ ఇంత గొప్ప ప్రదర్శన చేయడంలో శ్రేయస్ అయ్యర్ పాత్ర అత్యంత కీలకం. పంజాబ్ కప్పు గెలవకపోయినా.. శ్రేయస్ సారథ్యంలో ఒక ఛాంపియన్ జట్టులాగే ఎదిగిందన్నది స్పష్టం. ఎన్నో ఏళ్ల నుంచి జట్టులో మార్పులు చేర్పులు చేస్తున్నా పెద్దగా ప్రభావం చూపలేకపోయిన పంజాబ్.. శ్రేయస్‌కు బాధ్యతలు అప్పగించడంతో ఊహించని స్థాయికి చేరుకుంది. ఈ సీజన్‌కు ముందు పంజాబ్ జట్టును చూస్తే ఓ మోస్తరుగా అనిపించిందంతే. శ్రేయస్ అయ్యర్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టాయినిస్, చాహల్, అర్ష్‌దీప్ సింగ్‌లను మినహాయిస్తే పేరున్న అంతర్జాతీయ స్టార్లు కనిపించలేదు. వీరిలోనూ మ్యాక్సీ, చాహల్ ఫామ్ అంత గొప్పగా లేదు. స్టాయినిస్ ఒకట్రెండు మ్యాచ్‌ల్లో మినహా మెరిసింది లేదు. అయినా పంజాబ్ నిలకడగా విజయాలు సాధించింది. బ్యాటింగ్‌లో తాను ముందుండి నడిపిస్తూ.. ఇంకా అంతర్జాతీయ క్రికెట్ ఆడని ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ ఆర్య, శశాంక్ సింగ్, నేహాల్ వధేరా, విజయ్ కుమార్ వైశాఖ్, హర్‌ప్రీత్ బ్రార్ లాంటి కుర్రాళ్లను సమర్థంగా ఉపయోగించుకుంటూ శ్రేయస్ జట్టును తిరుగులేని స్థితిలో నిలబెట్టాడు. ఈ సీజన్లో పంజాబ్ భారీ స్కోర్లు చేసి గెలవడమే కాదు.. ప్రత్యర్థి జట్లను స్వల్ప స్కోర్లకు కట్టడి చేసింది. కోల్‌కతాతో మ్యాచ్‌లో 111 పరుగులకే ఆలౌటైనా సరే.. ప్రత్యర్థిని 95 పరుగులకే కుప్పకూల్చి విజయం సాధించింది. ఇక్కడే శ్రేయస్ కెప్టెన్సీ పనితనం అర్థమవుతుంది. శ్రేయస్ మీద వేలంలో పంజాబ్ రూ.26.75 కోట్లు పెట్టినపుడు అంత ధరా అనుకున్నారంతా! కానీ ఆ రేటుకు మించిన ప్రదర్శనతో పంజాబ్ రాత మార్చేశాడు. దిల్లీకి కెప్టెన్ అయిన తొలి సీజన్లోనే ప్లేఆఫ్‌కు చేర్చడమే కాదు.. ఇంకో ఏడాది ఫైనల్‌కూ తీసుకెళ్లిన ఘనత శ్రేయస్ సొంతం. ఇక పదేళ్ల విరామం తర్వాత నిరుడు కోల్‌కతాకు కప్పు సాధించి పెట్టిందీ శ్రేయసే. అయినా ఆ రెండు జట్లలో అతడికి సరైన గౌరవం దక్కలేదు. ఆ జట్లను ఉత్తమ స్థితికి తీసుకెళ్లాక అతను బయటికి రావాల్సి వచ్చింది. దీంతో పంజాబ్ పగ్గాలందుకున్నాక తనేంటో చూపించాలన్న కసి అతడిలో స్పష్టంగా కనిపించింది. ఈ ఐపీఎల్‌లో కెప్టెన్‌గా శ్రేయస్ నైపుణ్యాలు చూశాక అతణ్ని భవిష్యత్ భారత కెప్టెన్‌గా అభివర్ణిస్తున్నారు. రోహిత్ తర్వాత వన్డే పగ్గాలు తనకే దక్కాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక శ్రేయస్‌కు టెస్టు, టీ20 జట్లలోనూ చోటివ్వాలనే డిమాండ్లూ ఊపందుకున్నాయి. మూడేళ్ల ముందు వేలంలో అమ్ముడవని ఆటగాడు.. ఇప్పుడు ఓ జట్టుకు కెప్టెన్ అయి, తొలి సీజన్లోనే కప్పు సాధించిపెట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఈ అరుదైన ఘనతే సాధించాడు రజత్ పాటీదార్. అతను ఇంకెవరైనా జట్టును విజేతగా నిలిపితే మరీ విశేషంగా అనిపించేది కాదేమో. కానీ తొలి టైటిల్ కోసం 18 ఏళ్లుగా నిరీక్షిస్తున్న బెంగళూరుకు టైటిల్ అందించడంతో దేశవ్యాప్తంగా అతడి పేరు మార్మోగిపోతోంది. కోహ్లి పదేళ్లకు పైగా శ్రమించినా సాధ్యం కానిది.. కుంబ్లే, ద్రవిడ్, డుప్లెసిస్ లాంటి మేటి ఆటగాళ్లు ప్రయత్నించి విఫలమైంది.. రజత్ కెప్టెన్సీ అందుకున్న తొలి ఏడాదే సాధించాడు. మూడేళ్ల ముందు రజత్ పరిస్థితి చూస్తే.. అతను ఇప్పుడిలా ఛాంపియన్ కెప్టెన్ అవుతాడనే ఊహ కూడా ఎవరికీ వచ్చి ఉండదు. 2022 వేలంలో అతను అమ్ముడవనే లేదు. అంతకుముందు సీజన్లో రజత్.. ఆర్సీబీకే ఆడాడు. తర్వాతి సీజన్‌కు అతణ్ని అట్టిపెట్టుకుంటామన్న ఫ్రాంఛైజీ.. వేలంలో కూడా కొనుక్కోలేదు. వేరే ఆటగాడు గాయపడితే ప్రత్యామ్నాయం కింద అతణ్ని ఎంచుకుంది. అయితే ఆ సమయంలో ఆ జట్టులోకి వెళ్లొద్దని అనుకున్నాడట పాటీదార్. కానీ తర్వాత మనసు మార్చుకున్నాడు. సీజన్ మధ్యలో వచ్చి మెరుపు సెంచరీ బాదడంతో ఆర్సీబీ అతడి విలువను గుర్తించింది. తర్వాతి సీజన్లో గాయం వల్ల ఆడలేకపోయినా.. గత ఏడాది అతణ్ని అట్టిపెట్టుకుంది. ఈసారి ఏకంగా కెప్టెన్‌ను చేసింది. రజత్‌ను కెప్టెన్‌గా ప్రకటించినపుడు ఆర్సీబీ అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. తనకా స్థాయి లేదన్నట్లు మాట్లాడారు. రజత్‌లో కూడా కొందరికి ముందు కెప్టెన్సీ చేయగలన్న నమ్మకం లేదట. దీని గురించి మధ్యప్రదేశ్ కోచ్ చంద్రకాంత్ పండిట్ ఒక సందర్భంలో చెప్పాడు. "రెండేళ్ల క్రితం మధ్యప్రదేశ్ సారథ్యం తీసుకోవాల్సిందిగా పాటీదార్‌ని కోరాను. కానీ అప్పుడు అతడు చాలా బెరుకుగా కనిపించాడు. పొడుపుగా మాట్లాడుతూ ఎక్కువగా ఎవరితోనూ కలవని కెప్టెన్సీ చేయగల సత్తా తనకుందని అనుకొని ఉండడు. గతేడాది తానే స్వయంగా వచ్చి సారథ్యం చేస్తా అని చెప్పాడు. ముస్తాక్ అలీ టోర్నీలో జట్టును ఫైనల్ చేర్చాడు" అని పండిట్ తెలిపాడు. ఆ అనుభవంతోనే పాటీదార్.. ఆర్సీబీని నడిపించగలనన్న నమ్మకం వచ్చి ఉండొచ్చు. కోట్లమంది అనుసరించే, భారీ అంచనాలుండే జట్టుకు సారథ్యం వహించే బాధ్యతను తీసుకోవడమే పెద్ద సవాల్. ఆ సవాలును స్వీకరించి జట్టు రాతను మార్చేశాడు పాటీదార్. అంచనాల ఒత్తిడి వల్లో ఏమో కోహ్లి సహా గత కెప్టెన్లందరూ తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు.

## మేఘా శుక్లా: ది ఎరా ఆఫ్ ఆషికీ లైవ్స్ ఆన్



## సుశాంత్ ఈసారి గట్టి ప్లానింగ్ తోనే..!



అక్కినేని ఫ్యామిలీ హీరో సుశాంత్ 2021 లో ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా చేశాడు. ఆ తర్వాత గ్యాప్ తీసుకున్నాడు. అల వైకుంఠపురములో, భోళా శంకర్, రావణాసుర సినిమాల్లో నటించినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. అందుకే ఆఫ్టర్ షార్ట్ గ్యాప్ మళ్లీ తన సోలో సినిమాతోనే రాబోతున్నాడు సుశాంత్. ఈసారి యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్నాడని తెలుస్తుంది. సుశాంత్ 10వ సినిమా అఫిషల్ అతని బర్త్ డే మార్చి 18న వచ్చింది. ఈ సినిమాను పృథ్వీరాజ్ చిట్టేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సంజీవని క్రియేషన్స్ బ్యానర్ లో వరుణ్ కుమార్, రాజ్ కుమార్ కలిసి ఈ మూవీ నిర్మిస్తున్నారు. మిస్టరీ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ లో సుశాంత్ 10వ సినిమా ఉంటుందని తెలుస్తుంది. సుశాంత్ ఈ ప్రాజెక్ట్ విషయంలో చాలా గట్టి ప్లానింగ్ లోనే ఉన్నాడని తెలుస్తుంది. ఫస్ట్ లుక్ తోనే సుశాంత్ అదరగొట్టాడు. హీరోగా కాస్త గ్యాప్ ఇచ్చి స్టార్ సినిమాల్లో వెయిట్ ఉన్న పాత్రలు వేస్తూ వచ్చాడు. ఐతే అవేవి సుశాంత్ కి సంతృప్తిని ఇవ్వలేదు. ఆడియన్స్ కూడా సుశాంత్ అలా సైడ్ రోల్స్ చేయడం ఇబ్బందికరంగా ఫీల్ అయ్యారు. అందుకే ఈసారి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో అదిరిపోయే కథతో వస్తున్నాడని తెలుస్తుంది. సుశాంత్ స్క్రిప్ట్ దశలోనే సినిమా గురించి చాలా ఎగ్జైట్ అవుతున్నాడని తెలుస్తుంది. అందుకే మార్కెట్ పెద్దగా లేకపోయినా ఈసారి బాక్సాఫీస్ దగ్గర తన సత్తా చాటాలని చూస్తున్నాడు. అక్కినేని హీరోల్లో సుశాంత్ కూడా తన ప్రయత్నాలు తను చేస్తున్నాడు. అప్పట్లో హీరోగా వరుస సినిమాలు చేసిన సుశాంత్ కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఐతే సినిమాలు చేస్తుంటేనే ఏదో ఒక మంచి కథ పడి సక్సెస్ వస్తుంది. అందుకే సుశాంత్ కూడా అదే పంథా కొనసాగించాలని చూస్తున్నాడు. సుశాంత్ 10వ సినిమా ఎలా ఉంటుంది. అసలు ఎలాంటి సినిమాతో వస్తున్నాడు అన్నది ఆ ప్రాజెక్ట్ నుంచి ఏదైనా టీజర్ వస్తే తెలుస్తుంది. యువ దర్శకుడిగా పృథ్వీరాజ్ ఈసారి సుశాంత్ కి సూపర్ హిట్ ఇచ్చి తీరుతా అనే కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. మరి ఈ కాంబో ప్రేక్షకులను ఎంతమేరకు మెప్పిస్తుందో చూడాలి. సుశాంత్ కూడా మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కి వరుస సినిమాలు చేయాలని ఉత్సాహపడుతున్నారు.

## ప్రియాంక KD తన స్వంత రన్‌వేపై రాకింగ్ చేస్తోంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com